తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ| జనగాం |ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
31 జూలై 2026
పేజీలు - 8

# వదలని వాన.. అదే జోరు..


చేపల వర్షం

- జిల్లాలో 118.7 మి.మీ సగటు వర్షం
- ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి నది
- మానేరు వాగులో రాకపోకలు బంద్
- చెరువులకు జలకళ
- సింగరేణిలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి


జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరుసగా రెండో రోజు కూడా వర్షాలు ధారాపాతంగా కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వర్షాభావంతో బోసిపోయిన చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరిం చుకుంటున్నాయి. ఈ వర్షాలతో ఖరీఫ్ పంటలకు మేలు జరుగుతోంది. విత్తనాలు వేసిన రైతులకు ఉపశమనం కలిగింది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వార్త మెయిన్ 7లో

### వైద్య, విద్యుత్ శాఖల అధికారుల పనితీరుపై

## మండల సభలో ఆగ్రహం

- 30 గ్రామాల సర్పంచ్ లకు 16 మంది సర్పంచులే హాజరు
- గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- చెన్నారావుపేట ఎంపీడీవో వెంకట సాయి శివానంద్...




చెన్నారావుపేట, జూలై 30 ( జనం సాక్షి): వైద్య, విద్యుత్ శాఖల అధికారుల పనితీరుపై మండల సభలో గ్రామాలలోని సర్పంచులు అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చెన్నారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్షను నిర్వహించారు. చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ ప్రతిరోజు సమయపాలన పాటించడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 11 గంటలకు మూడుసార్లు వస్తే అందుబాటులో ఉండడం లేదని సిహెచ్ఓ భద్రయ్య పై చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో, తండాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం లేదని అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాధికారి సరోజన పనితీరుపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అలాగే అమీనాబాద్, కోనాపురం గ్రామాలలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని సబ్ సెంటర్లకే పరిమితమవుతూ గ్రామాలలో సరిగా తిరగకుండా ప్రజలకు వైద్య సేవలను అందించడం లేదని సర్పంచులు ధార రంజిత్, మైదం రాకేష్ లు వైద్య సిబ్బంది పనితీరు పై మండిపడ్డారు. 16 చింతల తండ గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న స్వరూప మహబూబాబాద్ లో ఒక ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్ గా పనిచేస్తుందని మళ్లీ 16 చింతల తండ గ్రామంలో ఆశా కార్యకర్తగా రెండు చోట్ల విధులను నిర్వర్తిస్తుందన్నారు. గ్రామంలో తన సేవలను సరిగా అందించడం లేదని ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజకు ఫిర్యాదు చేస్తే ఆరు నెలల నుండి పట్టించుకోవడంలేదని 16 చింతల తండా గ్రామ సర్పంచ్ బానోతు విక్రమ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా రెండు చోట్ల విధులను నిర్వర్తిస్తున్న స్వరూప పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు. అలాగే గ్రామాలలో, తండాలలో విద్యుత్ సమస్యలను పట్టించుకోవడంలేదని విద్యుత్ శాఖ అధికారులకు మిగతా 15లో..



## భద్రకాళి బండ్‌పై పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న
- భద్రకాళి,వడ్డేపల్లి బండ్ లపై కొనసాగుతున్న పనుల పరిశీలన

వరంగల్ ఈస్ట్, జులై 30 (జనం సాక్షి) : భద్రకాళి బండ్ పై పెండింగ్ పనులను పూర్తి చేసేలా చూడాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని భద్రకాళి, వడ్డేపల్లి బండ్ లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పూర్తి చేసిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతం గా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.


వార్త మెయిన్ 7లో

## బెల్టు షాపుల్లో ఏరులై పారుతున్న మద్యం

- విచ్చల విడిగా అమ్మకాలు
- ఒక్కో గ్రామంలో 10నుండి 20బెల్టు షాపులు

కౌటాల జూలై 30 (జనంసాక్షి) : పల్లెల్లో ఎక్కడ చూసిన బెల్టు షాపులే దర్శనమిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లిన బెల్టు షాపులు లేని గ్రామం లేదు. ఒక వైపు ఎక్సైజ్ అధికారులు షాపులపై చర్యలు తీసుకుంటున్న,మరో వైపు పుట్ట గొడుగుల్ల బెల్టు షాపులు నిలుస్తున్నాయి. కౌటాల మండలంలో మద్యం ఏరులై పారుతోంది. అధికారుల అలసత్వంతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తోంది.

నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్య మవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అం దుబాటులో ఉంటోంది. ఎప్పుడంటే అప్పుడు ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాపుల మాదిరి ఇళ్లలోనే లభ్యం అవుతోంది. కిలో మీటర్లమేర వైన్ షాపు లకు వెళ్లకుండానే ఎక్కడ రేటు ఉన్నప్పటికీ ఇంటి పక్కనే దొరుకుతుందని తాగుతున్నారు.



మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీ తిగా వ్యవహరిస్తున్నారు. అక్రమం గా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్ షాపుల నిర్వా హకులే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పల్లెల్లో ఎక్కడ చూసినా ప్రతి వాడలో కనీ సం 10నుండి 20వరకు బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. బెల్టు షాపుల కారణంగా గ్రామాల్లోని వైన్ షాపుల్లో కూడా గణనీయంగా మద్యం అమ్మకాలు నమోదవుతున్నాయి. మిగతా 15లో..

# ఉప్పొంగిన అనర్పల్లి, లక్మాపూర్ వాగులు

- 12 గ్రామాలకు నిలిచిన రాకపోకలు.
- వంతెనలు పూర్తిచేయాలని స్థానికుల డిమాండ్.
- ఈ క్లిష్ట పరిస్థితుల్లో మమ్మల్ని అనారోగ్యం బారిన పడకుండా దేవుడా నువ్వే కాపాడాలంటూ గ్రామస్తుల కన్నీటి ఆవేదన.



కెరమెరి,జులై30 (జనంసాక్షి) కెరమెరి మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు అనర్పల్లి,లక్మాపూర్ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వాగు అవతలి వైపున ఉన్న గోండు కరంజివాడ, పెద్దకరంజివాడ, అందుగూడ, దర్బాపటార్, బోరిలాల్గూడ, జనకాపూర్, శంకర్లోద్ది, అంతాపూర్, ఇంద్రానగర్ గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అత్యవసరమైన నిత్యవసరమైన ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సిందేనని, వాగు ఉప్పొంగిన పరిస్థితుల్లో తమ గ్రామాల్లో ఎవరైనా వృద్దులు,పిల్లలు, రోగులు అనారోగ్యం భారీన పడితే అంబులెన్స్, వైద్యులు రాని పరిస్థితి వారిని ఆసుపత్రికి ఎలా తీసుకెళ్లాలని దేవుడా మాకు నువ్వే దిక్కు అంటూ గ్రామస్తుల నుంచి ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో అనర్పల్లి వాగు ప్రవాహంతో వాగు దాటి ఆసుపత్రికి వెళ్లే వీలులేక అనేకమంది వృద్దులు,రోగులు సరైన సమయంలో చికిత్స అందక మరణించిన సంఘటనలు ఉన్నాయి. అనర్పల్లి ,లక్మాపూర్ వాగులపై 2014లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు రెండున్నర కోట్ల వ్యయంతో వంతెనలు మంజూరయ్యాయి. పదేళ్ల గడిచిన గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో వంతెన పనులు అసంపూర్తి ఉండి ముందుకు సాగలేకపోయాయి. దీంతో గ్రామస్తులకు వాగు కష్టాలు తప్పడం లేదు. మళ్లీ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా వంతెనలు పూర్తి కావాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తమ వాగు కష్టాలను గుర్తించి అనర్పల్లి, లక్మాపూర్ వాగులపై వంతెనలు పూర్తి చేయాలని కోరుతున్నారు.

# ప్రతి రోగికి మెరుగైన చికిత్స అందాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.
- ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ.
- వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశం.
- ఓపీ నమోదు, మాతా-శిశు సేవలు, ఫార్మసీ, ఇమ్యునైజేషన్ విభాగాల పరిశీలన.



ఆత్మకూర్, జులై 30 (జనం సాక్షి): జిల్లాలోని ప్రభుత్వ వైద్య సంస్థల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగం, మందుల నిల్వ గది, ల్యాబ్, ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, అబ్జర్వేషన్ వార్డులు, టీకాల నిల్వ కేంద్రం, రికార్డుల నిర్వహణ,ఓపీ నమోదు విధానం, వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, మాతా–శిశు సంరక్షణ సేవల రికార్డులను పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఓపీ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భిణులకు నాణ్యమైన మాతా–శిశు ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఫార్మసీలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ప్రతి ఉద్యోగి సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ స్పందన, ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. సంతోష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయండి

వాజేడు జూలై 30 ( జనం సాక్షి) ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి పెద్ద గొల్లగూడెం గ్రామాల మధ్య ఉన్న ఇసుక వాగు వంతెన నిర్మాణంలో భాగంగా 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు అది ఇటీవల కురిసిన వర్షాలకు ఇసుక వాగులోకి వరద నీరు భారీగా చేరడంతో అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయి రవాణా సౌకర్యాలు స్తంభించింది దీనితో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇది తెలుసుకున్న భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకర్లపూడి విక్రాంత్ వత్సవాయి జగన్నాధరాజును అక్కడికి పంపించి ప్రాజెక్టు మేనేజర్ గోపాల్ గోపాలకృష్ణతో ఫోన్ లో మాట్లాడారు ఆయా గ్రామాలకు ప్రమాణ సౌకర్యం పునరుద్ధరించడానికి ప్రత్యామ్నాయ మార్గం



ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్పందించిన ప్రాజెక్టు మేనేజర్ గోపాలకృష్ణ రేపు మధ్యాహ్నం సమయం లోపు మార్గం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాజేడు ఎస్సై జక్కుల సతీష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ జానకి షర్మిల



భానాపూర్ జూలై 30 (జనం సాక్షి) ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ ఎస్. జానకి షర్మిల అన్నారు. గురువారం లోతట్టు ప్రాంతాలను సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి వెళ్లేందుకు రెంకోనివాగుపై ఉన్న తాత్కాలిక రోడ్డు తెగిపోవడాన్ని ఆమె గమనించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. అలాగే మైనార్టీ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. రోడ్డు తెగిపోయిన చోట, ప్రమాదకరమైన ప్రాంతాలలో గస్తీ నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్ళకూడదని సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎస్పి వెంట డిఎస్పి శ్రీనివాస్, సిఐ సత్యనారాయణ, ఎస్ఐ రాహుల్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు షబ్బీర్ పాషాలు ఉన్నారు.

## పశువుల పాక కూలి రెండు పాడెడ్లకు గాయాలు



నెరడిగొండ జులై30(జనంసాక్షి): భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రైతులు తమ పశువులను కడెం, వాంకిడి వాగులు పొంగి పొర్లుతుండటంతో పరివాహక ప్రాంతాల్లో తమ పశువులను ఎట్టి పరిస్థితుల్లో మేతకు బయటకు వదలకుండా పక్క కొట్టములనే ఉంచి మేత వేయాల్సిందిగా, విద్యుత్ స్తంభాలకు దగ్గరగా పశువులను కట్టేయ్యకుండా తగు జాగ్రత్తలుతీసుకోవాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ పేర్కొన్నారు.బుధవారం రోజున జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కుంటాల కే గ్రామానికి చెందిన రైతు రాథోడ్ సచిన్ కుమార్ వారి పశువుల పాక కూలిపోయింది.అందులో రోజువారీగా ఉన్న రెండుపాడెడ్లకుగాయాలయ్యాయి.సమాచారం అందుకున్న పశు వైద్యదికారి రాథోడ్ జీవన్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి గాయపడిన ఎద్దులను పశు వైద్య చికిత్స నిర్వహించారు. బాధిత రైతుకు జరిగిన నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక సర్పంచ్ నాయకులు రైతులు కోరుతున్నారు.

## భారీ వర్షానికి కూలిన ఇంటిని
## పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నెరడిగొండ జులై30(జనంసాక్షి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూలిన. ఇంటి బాధితులకు ధైర్యంగా ఉండండి ఇండ్లు మంజూరు చేస్తాం,బాధితులకు తక్షణమే వ్యక్తిగత ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం రోజున ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రానికి చెందిన మొహమ్మద్,ఈశ్వరి బాయి ఇండ్లు కూలిపోవడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తక్షణమే ఇండ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు కోల్పోయిన వారి జాబితాను సిద్ధం చేయాలని,నష్టపరిహారం కొరకు నివేదిక అందజేయాలని అధికారులు ఎమ్మార్వో, ఎంపిడివోలనుఆదేశించారు.మండలంలో ఎక్కడ ఎవరికి నష్టం కలిగిన వెంటనే సమాచారం అందించాలనిసూచించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ గులాబ్,మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పందరీ, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**



**జనగామ ప్రతినిధి ,జూలై 30(జనంసాక్షి):** రెండు రోజుల్లో అన్ని డేటా లోపాలను సరిదిద్దాలి.. లేని పక్షంలో బాధ్యులపై చర్యలు తప్పవు. జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం, హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో లిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిలి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో అనేక పొరపాట్లు జరిగినట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయని తెలిపారు. అందువల్ల బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలని, యాదృచ్ఛికంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, అన్ని లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం చేసుకొని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం ఉంటుందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించాలని, బీఎల్‌వోలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించాలని సూచించారు. అలాగే అన్ని స్థాయిల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతిని వివరించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) అందజేసి, వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి వివరిస్తూ.. జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 99.19 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు రోజుల్లో వంద శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4, 5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని, అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈఆర్‌ఓలు యాదృచ్ఛిక తనిఖీలు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జనగామ, ఘనపూర్ (స్టేషన్) గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలి



**చిట్యాల, జూలై 30(జనం సాక్షి ):**వనమహోత్సవం--2026 కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్ఓ కార్యాలయం ఎదురుగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మీ - అంతయ్య నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ వసంతరావు, ఎంపీడీఓ జయశ్రీ ,ఏపి ఓ అలీం , టి ఏ సుధాకర్ పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యొక్క ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుర్ర వెంకటేశ్ గౌడ్, వార్డు సభ్యులు తౌటం నవీన్, మైదం శ్రావ్య శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, గ్రామపాలన సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో కాంగ్రెస్‌కు ఊపు

**లక్ష్యసాధనలో బీఎల్ఏలు, కార్యకర్తల కృషికి ఘన సన్మానం**




**బచ్చన్నపేట, జూలై 30 (జనం సాక్షి):**మండలంలో చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో 47 బూతులకు గాను 24 బూతుల్లో శతశాతం పూర్తి చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, కార్యకర్తలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ మసూద్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా సన్మానించారు. నిడిగొండ మణిచంద్ర, రంగు అశోక్, పొన్నం కరుణాకర్, నగేష్, కొక్కులకొండ బాబు తదితర బీఎల్ఏల సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా మహమ్మద్ మసూద్ మాట్లాడుతూ, మండలంలోని 47 బూతుల్లో ఇప్పటివరకు 24 బూతుల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం 100 శాతం పూర్తైందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ లక్ష్యాన్ని చేరుకోగలిగామని పేర్కొన్నారు. మిగిలిన బూతుల్లో కూడా త్వరితగతిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తి చేసి మండలాన్ని 100 శాతం పూర్తి చేసిన మండలంగా నిలపాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ఇదే ఉత్సాహంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దతరపు నరేష్, సీనియర్ నాయకులు నల్లగోని బాలకిషన్, సద్ది నర్సిరెడ్డి, అంబాల ఆగయ్య, జిల్లా సందీప్, గుర్రం బాలరాజ్, సానిక రాజు, సత్తయ్య, నరసింహులు, ఓబీసీ సెల్ నాయకుడు చెరుకూరి శ్రీనివాస్, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

**ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రైల్వే డివిజన్ ప్రకటించాలి**





**కాజీపేట జూలై 30(జనం సాక్షి)**కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలిబీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకులుఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం రోజున శాంతియుత ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్రం ప్రభుత్వ వైఖరి పై నిరసన తెలుపుతూ.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీని ప్రభుత్వమే నిర్వహించాలని, కోచ్‌ఫ్యాక్టరీలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు గురువారం రోజున జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కాజీపేట కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రైల్వే డివిజన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాజీపేట నుంచి క్రూలింక్‌లను తరలించవద్దని, కాజీపేటకు సమీపంలో ఉన్న బోడగుట్ట వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వరంగల్ లేదా కాజీపేట కేంద్రంగా సెంట్రలైజ్డ్ క్రూ లాబీ ఏర్పాటు చేయాలని, చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలని, స్థానిక ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్ ఇవ్వాలని, వరంగల్‌లో ఉన్న రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని, రైల్వే స్టేషన్ల ఎదుట ఉన్న ఆటో అడ్డాల నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయవద్దని, ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం కోసం రైల్వే శాఖ సహకరించాలని కోరారు. కాజీపేట కేంద్రంగా కొత్త రైలు సర్వీసులు మొదలుపెట్టాలని, రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు అత్యధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏండ్లుగా తెలంగాణ పై సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హక్కులను సైతం కేంద్రం అమలు పరచడం లేదని గుర్తు చేశారు. తెలంగాణ హక్కుల కోసం కొట్లాడాల్సిన తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులను తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ హక్కు ల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ఇటీవలే కేంద్ర రైల్వే శాఖ మంత్రి సైతం కలిసి తెలంగాణకు దక్కాల్సిన హక్కుల గురించి వివరించి, మంజూరు చేయాల్సిందిగా కోరా రు. కార్యక్రమంలో సీనియర్ నా యకులు నార్లగిరి రమేష్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, సంకు నర్సింగ రావు, బొంగు అశోక్ యాదవ్, నాయకులు పులి రజినీకాంత్ ముదిరాజ్, పోలపెల్లి రామ్మూర్తి, అఫ్జల్ , గబ్బేట శీను, నరసింహారావు, దువ్వ కనకరాజు, కొండ రాజు, పులి విక్రమ్, బరిగెల వినయ్, పున్నం చందర్, తండమళ్ల వేణు, చుంచు అశోక్, నరేష్, సాధినేని సుధాకర్, దశరథం, రాబర్ట్, వంశీ, గణేష్, చందు, హుస్సేన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**చిట్యాల, జూలై 30(జనం సాక్షి ) :** మండల కేంద్రానికి చెందిన బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు చిలుముల రమణా చారి తండ్రి కీ.శే చిలుముల శేఖరయ్య, అదే గ్రామానికి చెందిన కీ.శే ఆకుల మల్లయ్య మరణించగా గురువారం వారి ఇళ్లకు వెళ్ళి,కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ చిట్యాల మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ ,పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్ రెడ్డి ,మాజీ జెడ్పీటీసి గొర్రె సాగర్ , మండల యూత్ అధ్యక్షులు తౌటం నవీన్ ,టౌన్ అధ్యక్షులు బుర్ర శ్రీధర్ ,సీనియర్ నాయకులు పాండ్రాల వీరస్వామి, ఆరెపల్లి సమ్మయ్య , మేడిపల్లి శ్రీనివాస్ ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**మహదేవపూర్ :జూలై 30 (జనం సాక్షి)** మూడు రోజులుగా రోజులుగా మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఏం సాంబమూర్తి కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. మట్టి గోడల ఇండ్లలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. విద్యుత్ స్తంభాలు తీగలు ట్రాన్స్ఫార్మర్లను తాకరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద మోటర్లు ఆన్ లేదా ఆఫ్ చేసే సమయంలో తడిచేతులతో విద్యుత్ పరికరాలను తాకకుండా జాగ్రత్త వహించాలని అదేవిధంగా వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవేశిస్తున్న వాగులు వంకలను దాటేఅందుకు ప్రయత్నించవద్దని ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు వాహన దారులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. అత్యవసర పరిస్థితిలో వెంటనే దయల్ 100కు లేదా 871265 8116కు సమాచారం అంది ంచి పోలీసుల సహాయం పొందాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

# జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా

- జిల్లా అధికారులు అందుబాటులో ఉండాలి.
- సెలవులు రద్దు. వరద ప్రాంతాలకు వెళ్లొద్దు..
- సీజనల్ వ్యాధుల నుంచి జాగ్రత్తపడండి
- ప్రతి శుక్రవారం డ్రై డే పాటించండి



**మావల జూలై 31( జనం సాక్షి):** ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, చెరువులు, కాలువలు ఉప్పొంగే అవకాశం ఉన్నందున వరద నీటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అన్నారు. రైతులు భారీ వర్షాల సమయంలో పొలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, బలహీనమైన చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, అన్ని శాఖల అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా అవసరమైతే స్థానిక అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ తెలిపారు.

– తాగునీటిని తప్పనిసరిగా కాచి చల్లార్చిన తర్వాత లేదా శుద్ధి చేసిన నీటిని సేవించాలని పేర్కొన్నారు.

– ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవలన్నారు. పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు వంటి నీరు నిల్వ ఉండే వస్తువులను తరచూ శుభ్రం చేసి, నీరు నిల్వ కాకుండా చూడాలని అన్నారు.

– ప్రతి శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే--డ్రైడే" కార్యక్రమంలో భాగంగా ఇంటి పరిసరాల్లోని అన్ని నీటి నిల్వలను పూర్తిగా తొలగించి దోమల వ్యాప్తిని నివారించాలని తెలిపారు.

– జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించలన్నారు. వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు.భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధిలో దూసుకెళ్తున్న రేగుల గూడెం గ్రామపంచాయతీ


- సమస్యలను పరిష్కరిస్తున్న ఉపసర్పంచ్ పాలారపు వెంకటస్వామి
- సర్పంచ్ ఆమని సురేష్
- కాటారం మండలంలో రెండో సిటీగా పేరుగాంచిన రేగుల గూడెం



**కాటారం జూలై 30 (జనం సాక్షి ) :** రేగుల గూడెం గ్రామపంచాయతీలో నిన్న కురిసిన భారీ వర్షాలకు వీధుల్లో రోడ్లపై చెట్లు విరిగినవి గ్రామపంచాయతీ పరిధిలో గంగారం ఎక్స్ రోడ్ మూలమలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న వేప చెట్టుని రేగులగూడెం ఉపసర్పంచి పాలరపు వెంకటస్వామి వర్షంలోనే దగ్గరుండి అడ్డంగా ఉన్న వేప చెట్టుని తొలగించడం జరిగింది. సర్పంచ్ , ఉప సర్పంచ్ ఇద్దరూ సమన్వయంతో కలిసి పని చేస్తూ గ్రామస్తుల సమస్యలను తీరుస్తున్నారు.రేగుల గూడెం గ్రామపంచాయతీని కాటారం మండలంలో అన్ని గ్రామ పంచాయతీల కంటే రెండో పట్టణంగా మార్చేందుకు శాసకత్తుల కృషి చేస్తున్నారు. చల్లపల్లి నుండి రేగుల గూడెం,దేవరంపల్లి,గోపాలపురం విశాలంగా ఉన్న ఈ గ్రామపంచాయతీ ఎన్నో సమస్యలు ఉంటాయి. రాజకీయంలోకి పదవిలోకి రాగానే రాజకీయాల్లో దూసుకు వెళ్లాలని ఉద్దేశంతో ప్రతి విషయాన్ని గమనించి ఏ రోజుకు ఆ రోజే సమస్యను పరిష్కరిస్తున్నారు ఈ కొత్త పాలకవర్గం ప్రజల మన్నులు పొందు తూ సాగాలని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వర్షాకాల సీజన్లో శానిటేషన్ విషయంలో ముందుండి చూస్తున్న పాలకవర్గానికి అభినందనలు తెలుపుతున్నారు.

# సోలార్ యూనిట్ల ఏర్పాటును వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

## ఆత్మకూర్ మోడల్ సోలార్ విలేజ్లో లబ్ధిదారుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్



**ఆత్మకూర్, జులై 30 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా ఆత్మకూర్ గ్రామంలో అమలవుతున్న మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద మిగిలిన లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆత్మకూర్ గ్రామంలో మోడల్ సోలార్ విలేజ్ పథకం అమలును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొల్లపల్లి గణపతి నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ను పరిశీలించి, దాని పనితీరు, నిర్వహణ విధానం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలుగుతున్న ప్రయోజనాలపై వారితో మాట్లాడారు. అనంతరం గ్రామంలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పురోగతిపై తెలంగాణ రెడ్కో, విద్యుత్ శాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మొదటి విడతలో అర్హులైన 764 మంది లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు మంజూరుకాగా, ఇప్పటివరకు 251 ఇళ్లలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఇళ్లకు అవసరమైన సామగ్రిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చి, ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మోడల్ సోలార్ విలేజ్గా ఎంపికైన ఆత్మకూర్ గ్రామంలో మిగిలిన లబ్ధిదారుల ఇళ్లలో కూడా సోలార్ యూనిట్ల ఏర్పాటు ఆలస్యం కాకుండా అవసరమైన మెటీరియల్ను వెంటనే సమీకరించి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, టీజీ రెడ్కో ఫీల్డ్ అధికారులు దీపక్, నవీన్ కుమార్ యాదవ్, ఆత్మకూర్ తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు భరత్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మావల జులై 31(జనం సాక్షి):భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వర్షాలు, వరదలకు సంబంధించిన అత్యవసర పరిస్థితులు లేదా సహాయం అవసరమైన సందర్భాల్లో ప్రజలు టోల్-ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు అనవసర ప్రయాణాలు చేయకుండా, వాగులు, లోతట్టు ప్రాంతాలు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ కోరారు.

# భారీ వర్షాలతో మురిసిన అన్నదాత



**కౌటాల జూలై 30 జనం సాక్షి** తెలంగాణలో ఇటీవల కురుస్తున్న విస్తారమైన వర్షాలతో ఎల్నినో ప్రభావం వల్ల ఎండిపోతున్న పంటలకు జీవం పోసి, రైతన్నల మొహాల్లో ఆనందం నింపాయి.మండలంలో వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు ఈ వానలు ఊరటనిచ్చాయి. ఎండిపోతున్న ఆరుతడి,పత్తి పంటలకు ఈ వర్షాలు ప్రాణం పోశాయి.వరుణుడి కరుణతో పొలం పనులు మళ్లీ ఊపందుకున్నాయి. వాగులు, వంకలు పొంగడంతో ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది.వర్షాలు ఆలస్యం కావడంతో నిరాశలో ఉన్న రైతుల ఆశలు ఈ వర్షాల వల్ల మళ్లీ చిగురించాయి. పంట పొలాల్లో చేరిన నీరు ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పంట పొలల్లో నీరు నిండుగా చేరింది. వరి నాట్లు వేయడానికి ఇబ్బంది పడుతున్న సమయంలో భారీ వర్షాలతో దుక్కి దున్ని వరి నాట్లు నాటుతున్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దు



**నెరడిగొండ జులై30(జనంసాక్షి):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్,రాష్ట్ర అబ్జర్వర్ రాథోడ్ బాపూరావు బోత్ నియోజకవర్గ ప్రజలకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.బుధవారం భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని సూచించారు.ప్రభుత్వ యంత్రాంగం జారీ చేసే హెచ్చరికలను పాటిస్తూ తమ కుటుంబ సభ్యుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రజలందరూఅప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# గిరిజన ప్రాంతాలలో వంతెన నిర్మాణాలు చేపట్టాలి

## నందిరామయ్య



**ఖానాపూర్ జూలై 30 (జనం సాక్షి)** అటవీ ప్రాంతాలలో ఉన్న గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న వాగులపై వంతెనల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని నిర్వచించల్ గ్రామ పరిధిలోని బల్లి వాగు దాటుతుండగా చామనపల్లి గూడెం కు చెందిన మర్సుకోల పారు బాయి మృతి పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. పటేల్ ప్రాంతంలోని గిరిజన గుడాలకు అడ్డుగా ఉన్న వాగులపై వంతెనెల నిర్మాణాలు చేపట్టకపోవడం గిరిజన గూడాలకు శాపంగా మారిందని అన్నారు. గిరిజన గుడాలకు వెళ్లేందుకు అడ్డుగా నిలుస్తున్న వాగులపై వెంటనే పాలకులు స్పందించి వంతెన నిర్మాణాలకు తక్షణం చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే పారు బాయి మృతికి ప్రభుత్వం 5 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఆయన రిమాండ్ చేశారు.

# విద్యార్థులను చదవడం, రాయడంలో ఉత్తమంగా ఉండేలా తీర్చిదిద్దాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**ఆత్మకూరు, జూలై 30 (జనం సాక్షి):**విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, చదవడం, రాయడం, భావవ్యక్తీకరణలో మెరుగైన నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నిర్మల కుమారిని కలెక్టర్ పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంతమంది కొత్తగా ప్రవేశాలు పొందారని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు.పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో ఉపాధ్యాయులకు బోధనలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, విద్యార్థి కేంద్రిత అభ్యాస విధానాలు, ప్రాథమిక భాషా మరియు గణిత నైపుణ్యాల పెంపు, నిరంతర మూల్యాంకన విధానాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించి ఉపాధ్యాయులతో చర్చించారు.పాఠశాలలో ఉన్న లైబ్రరీని పరిశీలించారు. వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండుతున్న భోజన పదార్థాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న టాయిలెట్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఏడో తరగతి విద్యార్థులకు భారతరత్న సర్ సివి రామన్ సంబంధించి ఆంగ్ల పాఠ్యాంశం ఉపాధ్యాయురాలు బోధిస్తుండగా కలెక్టర్ తరగతి గదిని సందర్శించారు. ఏ పాఠ్యాంశాన్ని చదువుతున్నారని విద్యార్థులను కలెక్టర్ అడగగా సివి రామన్ లెసన్ అంటూ బదులిచ్చారు. హూ వాజ్ సీవీ రామన్ అని ఆంగ్లంలో కలెక్టర్ అడుగగా గ్రేట్ సైంటిస్ట్ అంటూ విద్యార్థులు ఆంగ్లంలోనే సమాధానం ఇచ్చారు. దీంతో వెరీ గుడ్ అంటూ విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.ఆంగ్లంలో ఉన్న ఆ పాఠ్యాంశాన్ని విద్యార్థుల చేత కలెక్టర్ చదివించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ విద్యార్థులు విద్యా ప్రగతిలో ఉత్తమంగా నిలవాలంటే పాఠ్యాంశాన్ని బోర్డు మీద రాయడం కాకుండా డిక్టేషన్ గా ఉపాధ్యాయులు చెప్పడం ద్వారా విద్యార్థులు సొంతంగా రాయడం, చదవడంపై పట్టు సాధించగలరని అన్నారు. విద్యార్థులను ఇంగ్లీషులో బాగా రాయడం, చదివేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, ఎంఈఓ విజయ్ కుమార్, తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 30 ( జనం సాక్షి ) :**ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నీల రాజమ్మ గట్టయ్య,కో-ఆప్షన్ సభ్యుడు మొహమ్మద్ మషూక్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని11వ వార్డులో నిర్వహిం చిన ఇంకుడు గుంతల కార్యక్రమం విజయవంతం గా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నీల రాజమ్మ గట్టయ్య, కో-ఆప్షన్ సభ్యుడు మొహమ్మ ద్ మషూక్ మాట్లాడుతూ ప్రజలకు వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ పరిరక్షణలో ఇంకుడు గుంత ల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఇంటి వద్ద, ప్రభుత్వ కార్యాల యాలు, విద్యాసంస్థలు, ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించి, భవిష్య త్ తరాలకు నీటి వనరులను సంరక్షించాలని పిలుపునిచ్చా రు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాము లై పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకా రం అందించాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ది

# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి




**చెన్నారావుపేట, జూలై 30 ( జనం సాక్షి):** వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెన్నారావుపేట మండల విద్యాశాఖ అధికారిని మానుపాటి పాపమ్మ అన్నారు.గురువారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్ జిటి ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు నిర్వహించిన వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పై శ్రద్ధ పెట్టాలని తెలిపారు.అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తెలుగు,ఇంగ్లీష్,గణితం సబ్జెక్ట్ పై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ సబ్జెక్ట్ లపై పట్టు సాధించి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అర్థం అయ్యేవిధంగా నేర్పించాలని తెలిపారు.అలాగే విద్యార్థుల హాజరు శాతం ను పెంచాలన్నారు.ప్రతి రోజు ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు ను ఎఫ్ఆర్ఎస్ యాప్ నందు నమోదు చేయాలని పాఠశాలల్లో నూతనంగా చేరిన విద్యార్థులకు యూ డైస్ ప్లస్ యాప్ నందు నమోదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ లు నల్ల రవి, ఆడవాల్ల సునీత, పడిదల విజేందర్ రావు, ఉపాధ్యాయులు పూజారి సురేందర్ గౌడ్, రామా చారి, తగరం యాకయ్య, ఇల్ల సూరయ్య, కుమారస్వామి, జగన్మోహన్, అశోక్, శ్రీహరి, రాజు, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, దస్రూ, మహేష్, కొమురయ్య, వేద ప్రకాష్, బాను ప్రకాష్, మాధవి, పద్మ, సుష్మ, ఝాన్సీ రాణి, ఉమాదేవి, పవనకుమారి, సునీత, జార, హఫీజున్నిస బేగం, సంధ్యారాణి, అనుషా, దేవీ, జయశ్రీ, అక్షయ పావని, సత్య పూర్ణిమ, ఎంఆర్సి సిబ్బంది అశోక్, స్వప్న, యాదగిరి, సీఆర్పీలు సంపత్, స్వామి, బాలు, శిల్ప, ఆఫీస్ సిబ్బంది గుళ్ళపెల్లి రాజశేఖర్, సునీల్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ గుంతలను పూడ్చాలి



**మంగపేట జూలై 30(జనం సాక్షి)**మండలంలోని రమణ క్కపేట గ్రామంలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ కాలువల పక్కన ఉన్న ప్రమాదకర గుంతలను వెంటనే పూడ్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు రవి గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ లక్ష్మణ చారికి వినతిపత్రం అందజేశారు. ఇరుకుగా ఉన్న సీసీ రోడ్లపై ఎదురుగా వాహనాలు వస్తున్నప్పుడు పక్కకు తప్పుకునే క్రమంలో ప్రజలు డ్రైనేజీ పక్కనున్న గుంతల్లో పడే ప్రమాదాలకు ఉంది అన్నారు. అలాగే డ్రైనేజీ పక్కనున్న గుంతలను పూడ్చకపోవడంతో వాటిలో వర్షపు నీరు లేదా డ్రైనేజీ నీరు నిల్వ ఉండి దోమల బెడద, అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది అని పాఠశాలకు వెళ్లే చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు ఈ మార్గంలో నడవడానికి తీవ్ర భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పక్కనున్న గుంతలను మట్టితో పూడ్చి, రహదారిని సమతలంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో చరణ్, వినయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు చేరువలో పోలింగ్ కేంద్రాలు



**ములుగు ప్రతినిధి,జూలై 30(జనంసాక్షి).**వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండాతమ ఓటు హక్కును వినియోగించుకునేలా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ములుగు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి తెలిపారు.గురువారం వెంకటాపూర్ మండల పరిధిలోని నూతన పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో కృష్ణవేణి పరిశీలించారు.ఈ సందర్భంగా సుబ్బక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ నెం. 5/ఏకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించారు.ప్రస్తుతం ఉన్నా పోలింగ్ స్టేషన్ నెం. 4లో ఉన్న 1,391 మంది ఓటర్లలో 50 మందిని, పోలింగ్ స్టేషన్ నెం. 5లో ఉన్న 1,345 మంది ఓటర్లలో 400 మందిని విభజించి సుమారు 450 నుంచి 500 మంది ఓటర్లతో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలు నాలుగు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటంతో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన అధికారులు, వారి సౌకర్యార్థం కొత్త కేంద్రాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు.అనంతరం పేర్కపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ నెం. 3/ఏ ను ఈఆర్వో సందర్శించారు.ఈ కేంద్రం పరిధిలో బావ్‌సింగ్‌పల్లి గ్రామానికి చెందిన 277 మంది, లక్ష్మీపురం గ్రామానికి చెందిన 150 మంది, పేర్కపల్లి గ్రామానికి చెందిన 300 మంది కలిపి మొత్తం 727 మంది ఓటర్లు ఉండనున్నారు.ఇప్పటి వరకు 1,221 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం నుంచి వీరిని విభజించినట్లు తెలిపారు.సుబ్బక్కపల్లి, పేర్కపల్లి గ్రామ పంచాయతీల గ్రామసభలు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానాలు ఆమోదించినట్లు వెల్లడించారు.రానున్న 109-ములుగు శాసనసభ నియోజకవర్గం, 16-మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రతి ఓటరికి చేరువలో ఓటింగ్ సౌకర్యం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గిరిబాబు, ఎన్నికల డిటి నితీష్ కుమార్, బి ఎల్ వోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సర్పంచులు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ**



**నడి కూడ జూలై 30 (జనం సాక్షి) :** నేడు అనగా శుక్రవారం నడి కూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ రామకృష్ణ పత్రిక ప్రకరణ ద్వారా తెలియజేశారు ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి 45 రోజులకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధిపై చర్చించాలని ఆదేశాలు జారీ చేయగా వారి ఆదేశానుసారం శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన నడి కూడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతున్నదని మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులు సమయపాలనతో హాజరై వారి వారి గ్రామాల సమస్యలను వెలిబుచ్చుకోవాలని ఈ సమావేశం విజయవంతం చేయాలని తెలియజేశారు

# ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ముగింపు



**పర్వతగిరి:జూలై 30 (జనం సాక్షి)**పర్వతగిరి మండలంలోని అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేయుచున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు జరిగిన శిక్షణ ఈరోజు తో ముగిసినట్లు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ బిక్షపతి తెలిపారు. కార్యక్రమం లో పాల్గొని ఆయన ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యా లను సద్విని యోగం చేసుకు ంటూ విద్యార్థు లకు సులభత రమైన రీతిలో బోధించాలని అన్నారు. తరగతిగది బోధనను సులభతరం ఇలాంటి శిక్షణ తరగతులు అవసరమని అన్నారు. ఈ శిక్షణ తరగతులలో ఉపాధ్యాయులు కిషోర్ ప్రసాద్ పరుష, శ్రీధర్ వ్యవహరించారు.పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితులలో ప్రజలకు అందుబాటులో ఉంటాం

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, జూలై 30,(జనంసాక్షి)** ప్రస్తుతం వర్షాల వల్ల నెలకొన్న పరిస్థితులలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మున్సిపల్ పరిధిలోని 19, 7 వార్డులలో నెలకొన్న స్థితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎ.సి.పి. కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలను అందించేందుకు అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని కొన్ని గ్రామాలకు వరద కారణంగా రవాణా ఇబ్బందులు ఏర్పడే పరిస్థితిని అధిగమించేందుకు రహదారి అనుసంధానం అంశంపై అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు కామాఖ్య అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించడం జరిగిందని, 7వ వార్డులో కూలిన ఇంటి గోడ స్థితిని పరిశీలించడం జరిగిందని తెలిపారు. సంబంధిత ఇంటి యజమానులకు పరిహారం అందించి ఇంటిని నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. కోటపల్లి మండలం ఆల్గాం గ్రామంలో కూలిన ఇంటి గోడకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాలలో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో అంతకుముందు జిల్లా కలెక్టర్ మందమర్రి మున్సిపల్ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్, మండల తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తిచేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంకా ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా సేకరించే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ పన్ను బకాయిలను త్వరగా వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జలకళను సంతరించుకున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు

### శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా చేరుతున్న వరద నీరు



**మంచిర్యాల ప్రతినిధి జూలై 30 జనం సాక్షి** ఉపరితల ఆవర్తనంతో గత రెండు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి . భారీ వర్షాలతో మంచిర్యాల జిల్లా తడిసి ముద్దయింది. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని గుడిపేట సమీపంలోని గోదావరి నదిపై ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది . గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ భాగం నుండి క్యాచ్ మెంట్ ఏరియా నుండి భారీగా వరద నీరు పోటెత్తుతుంది . ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి సామర్థ్యం148 అడుగుల గాను 146 అడుగుల నీటిమట్టం చేరుకుంది . 20.175 టీఎంసీల గాను 15.5 టీఎంసీల నీరు చేరుకుంది . నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు నుండి 16 గేట్లు ఎత్తి వరద నీటిని కిందికి నీరు వదిలారు . ఒక లక్ష 69 వేల క్యూసెక్కుల నీటిని వదలంతో ఆ నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరనుంది . ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రజలు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు . ముఖ్యంగా ప్రాజెక్టు దిగువన గల గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, పశువుల కాపరులు, ఇతరులు నది ఒడ్డుకు లేదా నదీ ప్రవాహ ప్రాంతంలోకి వెళ్లరాదని ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవీంద్ర చారి విజ్ఞప్తి చేశారు .

# వ్యాధులు ప్రబలకుండా పగడ్బందీ చర్యలు చేపట్టాలి

### జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్



**నిర్మల్ బ్యూరో, జూలై 30, (జనంసాక్షి).** అధికంగా వర్షాలకు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ మరియు నివారణ చర్యలను చేపట్టాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ గారు సిబ్బందికి ఆదేశం ఆదేశించారు. ఈ రోజు జూమ్ మీటింగ్ ద్వారా వైద్యాధికారులతో మాట్లాడుతూ నిన్న రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా ఇటువంటి ఇబ్బంది ఉన్న సేవలందించేందుకు సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని కోరారు. ముఖ్యంగా అధిక వర్షాల వల్ల రోడ్డు మార్గం తెగిపోయే గ్రామాలలో ఉన్న గర్భవతులను బర్త్ వెయిటింగ్ రూమ్స్ కు తరలించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించడానికి రాపిడ్ రెస్పాన్స్ బృందాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉంచాలని కోరారు. అదేవిధంగా వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవలసిన చర్యలు జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ సౌమ్య ,డాక్టర్ పవన్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఆకాష్ ,జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలి:డిపిఓ శ్రీనివాస్



**ఖానాపూర్ జూలై 30 (జనం సాక్షి)** వర్షాకాలంలో ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని డిపిఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎంపీడీవో రాధా రాథోడ్ తో కలిసి ఆయన మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. దిలావర్పూర్ గ్రామంలో ఆరే ఎర్రన్న ఇల్లు కూలిపోవడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఉన్నదాధికారులకు నివేదిస్తామని తెలిపారు. అలాగే సుర్జాపూర్, మేడం పల్లి గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. బ్లీచింగ్ పౌడర్, బై లార్వా, ఫాగింగ్ మిషన్ ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం సదర్ మాట్ ఆనకట్టను సందర్శించారు.

# మత్స్యకారులు చేపలు వేటకు వెళ్ళరాదు

### ఆర్. అవినాష్ జిల్లా మత్స్య శాఖ అధికారి,మంచిర్యాల



**మంచిర్యాలప్రతినిధిజూలై30జనంసాక్షి** మంచిర్యాల జిల్లాలో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కారణంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో చేపల వేటపై నిషేధం ఉండటం వలన మత్స్య కారులు ఎవరు కూడా చేపల వేటకు వెళ్ళరాదని ఆర్.అవినాష్ జిల్లా మత్స్య శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు మత్స్య కారులు భారీ వర్షాల సూచన ప్రకారం చేపల వేట నిషేధించబడినది ఎవరు కూడా చెరువులు, వాగులు, కాలువలు దగ్గరకు చేపల వేటకి వెళ్ళకూడదని మరియు సరదాగా ఈత కొట్టడానికి గాని వెళ్ళకూడదని హెచ్చరిస్తున్నము.చెరువులు మరియు కుంటల దగ్గర చేపల కోసం జాలీలు, వలలు అమర్చిన యెడల తక్షణమే వాటిని తొలగించవలసిందిగా మత్స్య శాఖ నుండి విజ్ఞప్తి. దీన్ని పాటించని యెడల మత్స్యకారుల యొక్క లైసెన్సు మరియు సంఘాల యొక్క రిజిస్ట్రేషన్ రద్దు చేయబడనని తెలియజేయబడుతుంది. ముఖ్యంగా గోదావరి ప్రవాహిక మండలాల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేస్తున్నాం. మీ యొక్క గ్రామపంచాయతీ పరిధిలో టామ్ టామ్ ద్వారా చేపల వేటకు వెళ్లరాదని అందరినీ అప్రమత్తం చేయవలసిందిగా మత్స్య శాఖ వారు కోరుచున్నారు. గోదావరి మరియు రిజర్వాయర్లలో చేపల వేట నిషేధం ఉన్నది కనుక అందరూ తప్పనిసరిగా పాటించాలని మత్స్య శాఖ నుంచి విజ్ఞప్తి చేశారు .

# క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి వివేక్



**మంచిర్యాల ప్రతినిధి జూలై 30 జనం సాక్షి.** గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఇల్లు కూలడంతో ఇంటిలోని నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కార్మిక శాఖ మంత్రి వివేక్ పరామర్శించారు . మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామలో భారీ వర్షాల దాటికి బుధవారం ఇల్లు కూలి నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయలు కావడంతో క్షతగాతులను ఆసుపత్రికి తరలించారు . మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని చెన్నూరు ఎమ్మెల్యే కార్మిక శాఖ మంత్రి వివేక్ పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. .క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. ఇల్లు కూలిపోయి నష్టపోయిన కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగా కుటుంబానికి న్యాయం చేస్తాం అని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పురాతన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ నివసించవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు .వర్షాల తీవ్రత దృష్ట్యా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.భారీ వర్షాల కారణంగా చెన్నూరులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరికైనా ఇబ్బందులు కలిగితే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు .

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ ను సందర్శించిన జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**వెంకటాపూర్(రామప్ప)జూలై30(జనం సాక్షి):–** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంకటాపూర్ మరియు పాలంపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ ను జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధీర్ సందర్శించి సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,గుత్తి కోయ గుడాల గ్రామాలలోని ప్రజల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి ఆరోగ్య సేవలు అందించాలని, ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్ గదిని రిజిస్టర్ లను పరిశీలించి, జ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి రక్త నమూనాను సేకరించి మలేరియా డెంగ్యూ టెస్టులను చేయాలని తెలిపారు. ఆశా కార్యకర్తల రిజిస్టర్లను పరిశీలించి, ఆశ కార్యకర్తలు ఇంటింటి సందర్శన గావించి జ్వరముతో బాధపడుతున్న వారిని గుర్తించాలని, నీటి నిలువలు లేకుండా, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి యజమానులకు అవగాహన కల్పించాలని వివరించారు. ఈ వర్షాకాలంలో ముంపు గ్రామాలలోని గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు.పాలంపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను సందర్శించి,రికార్డులను రిజిస్టర్ లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతూ ,అసంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్ 100% చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పాషా కమ్యూనిటీ హెల్త్ ఆఫీస్ దుర్గారావు పాలంపేట మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ భవ్య స్టాఫ్ నర్సులు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

### పిఏసిఎస్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య



మల్హర్,జూలై30(జనంసాక్షి ) తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది అని పిఏసిఎస్ ఛైర్మన్ ఇప్ప మొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఛైర్మన్ మొండయ్య మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' ప్రకటించింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

# మాతా, శిశు మరణాల నివారణకు ప్రత్యేక దృష్టి

### హై రిస్క్ కేసులను ముందుగానేగుర్తించాలి
### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనం సాక్షి):**జిల్లాలో మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నమోదైన మాతా, శిశు మరణాలపై గురువారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మరణాలకు గల కారణాల నివేదికలను పరిశీలించారు. జిల్లాలో రెండు మాతా, మూడు శిశు మరణాలు సంభవించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా, శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీల పర్యవేక్షణ, సకాలంలో వైద్య సేవలు, ప్రసూతి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు ఆదేశించారు. హై రిస్క్ కేసులను ముందుగానే గుర్తించి అంగన్ వాడి కేంద్రాలు, ఆశాలు, ఏఎన్ఎంల ద్వారా తగిన చికిత్స అందించాల్సిందిగా స్పష్టం చేశారు. ఆశా, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో గ్రామ స్థాయిలో ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మరణాన్ని విశ్లేషించి కారణాలను గుర్తించి భవిష్యత్తులో మరణాలు జరగకుండా పటిష్ట నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించడం అత్యంత ప్రాధాన్యత అని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ఉప వైద్యాధికారి డా. శ్రీదేవి, ప్రోగ్రాం అధికారి డా. నాగరాణి, మెడికల్ అధికారులు, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

### నల్ల బ్యాడ్జలతో విధులకు హాజరైన ఉద్యోగులు

**మంగపేట జూలై 30(జనంసాక్షి)**రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు వికసిత్ భారత్– జి రామ్ జి ఉపాధి హామీ పథకంలో ఫిక్స్డ్ టార్మ్



ఎంప్లాయిమెంట్ (ఎఫ్టిఈ) సిబ్బంది గురువారం మండలంలోనిమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ నల్ల బ్యాడ్జ్లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు ఉద్యోగులు తెలిపారు. ప్రధాన డిమాండ్లలో పే స్కేల్ అమలు, మూడు నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయడం, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, పదోన్నతులు, బదిలీలు అలాగే కెరీర్ అడ్వాన్స్మెంట్ పాలసీ అమలు తదితర సమస్యలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ నిరసనలో ఏపీఓ మహమ్మద్ అంకుస్, టెక్నికల్ అసిస్టెంట్లు నాయకపు శిరీష, బొల్లా సతీష్, ఏడుల్లా రాంబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు అడ్డురి శ్రీకాంత్, ఏఎస్యూ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు..

# రోడ్డు పై గుంతను పూడ్చిన పోలీస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు

### హర్షం వ్యక్తం చేసిన ప్రయాణికులు



**నూగూర్ వెంకటాపురం జూలై 30(జనం సాక్షి ):–** చినుకు పడితే చిత్తడే అన్నట్టుగా మారింది ఏజెన్సీ ప్రాంత రోడ్ల పరిస్థితి. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఈ ప్రాంతం లో రోడ్లన్నీ ధ్వంసం అయి ఎక్కడ రోడ్డు ఉందని వెతుక్కొని ప్రయాణించే దుస్థితి ఏర్పడింది. నిత్యం అభివృద్ధి జపం చేసే పాలకులు రోడ్డు పై ప్రయాణించే ప్రయాణికుల పాట్లు ఎందుకు పట్టవని ప్రశ్నిస్తున్నారు. వెంకటాపురం వాజేడు ప్రధాన రహదారి మార్గంలో అరుగుంట పల్లి జిల్లా కాలనీ గ్రామాల మధ్య పాలెం వాగు బ్రిడ్జ్ సమీపంలో పెద్ద గుంట పడి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. గతంలో ఒక గర్భిణీ ద్విచక్ర వాహనం పై నుండి పడి తీవ్ర గాయాలు పాలు అయింది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలతో నిండి చేరువులను తలం ిస్తున్నాయి. వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతి, స్థానిక బర్లగూడెం గ్రామపంచాయతీ అధికారి తాటి మౌనిక, వార్డ్ మెంబెర్ కుంజ మహేష్ జేసీబీ సహాయం తో గుంతలను పూడ్చినారు. రోడ్డు పైన పేరుకుపోయిన నీళ్లని తొలిగించారు. సంబంధిత రోడ్డు అధికారులు అధికారులు పట్టించుకోకపోయినా స్థానిక ఎస్సై, గ్రామపంచాయతీ అధికారి చొరవతో సమస్య పరిస్కారం అయినందుకు ప్రయాణికులు వాళ్లకు హర్షం వ్యక్తం చేసారు.ఇప్పటికైనా సంబంధిత రోడ్డు రవాణా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.పంచాయతీ సిబ్బంది తాటి నరేష్, కొప్పుల సారబాబు పాల్గొన్నారు.

# పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### సర్పంచ్ మైదం జోగేశ్వర్




**దేవరుప్పుల, జూలై 30 (జనం సాక్షి)** దేవరుప్పుల మండలం చిన్నమాదూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు కార్యక్రమంలో సర్పంచ్ మైదం జోగేశ్వర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను కూడా ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు పౌర హక్కులపై అవగాహన పెంపు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి శివారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షులుగా కోడూరి రాములు



**బచ్చన్నపేట, జూలై 30, ( జనం సాక్షి):**మండల కేంద్రంలోని విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలఅయంలో గురువారం సంఘ ప్రత్యేక సమావేశం ఘనంగా నిర్వహించబడింది. సంఘ సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని సర్వసమ్మతంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష పదవికి కోడూరి రాములు చారి పేరును సభ్యులందరూ ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. ఎలాంటి అభ్యంతరం లేకుండా ఆయనను నూతన అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన. సంఘ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాములు చారి మాట్లాడుతూ, సంఘంలో పరస్పర సహకారంతో ఐక్యతను పరిరక్షిస్తూ, విశ్వబ్రాహ్మణ కులస్తుల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అత్యవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరపతి సంఘం అధ్యక్షులు నరసింహ చారి, మండల ఉపాధ్యక్షులు మహంకాళి శ్రీనివాస్ చారి, మండల అధ్యక్షులు కోడూరి వెంకటాచారి, జిల్లా ఉపాధ్యక్షులు కోడూరి మహాత్మాచారి, గౌరవ అధ్యక్షులు కోడూరి సిద్ధులు, మహంకాళి యాదగిరి, వెంకటయ్య, బ్రహ్మాచారి, వెంకటేష్, శ్రావణ్, రవి, బాలరాజ్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఽసముద్రం జూలై 30 (జనం సాక్షి)**జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 38 మంది లబ్ధిదారులకు14,38,000 రూపాయల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ పంపిణీ చేశారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి,ఆర్టిఏ మెంబర్ రావుల మురళి,బానోత్ వెంకన్న,బండారు దయాకర్,బండారు వెంకన్న,కదిరే సురేందర్,నూకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గండీరామన్న దత్తసాయి ఆలయ నూతన చైర్మన్‌గా కొట్టె శేఖర్ ప్రమాణ స్వీకారం



నిర్మల్ జూలై30 (జనంసాక్షి) నిర్మల్ పట్టణంలోని శ్రీ గండీరామన్న దత్తసాయి ఆలయ నూతన చైర్మన్‌గా నియమితులైన కొట్టె శేఖర్ గురువారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు నూతన చైర్మన్ కొట్టె శేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఆలయ పరిపాలన పారదర్శకంగా కొనసాగుతూ, ప్రతి భక్తునికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవాభావంతో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ భక్తుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని శ్రీహరి రావు అన్నారు. కార్యక్రమంలో పలువురు శ్రీ సాయి సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్ మోహన్ రెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సోమ్ భీం రెడ్డి,, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్ ఈ కేవైసీ గడువును పొడిగించాలి

## ప్రభుత్వానికి రేషన్ కార్డ్ దారుల విజ్ఞప్తి



కెరమెరి, జూలై30 (జనంసాక్షి) కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు,వంకలు ఉప్పొంగుతున్న క్రమంలో రేషన్ కార్డుదారులో ఆందోళన మొదలైంది. ఈనెల 31 వరకు రేషన్ ఈ కేవైసీ ప్రక్రియ గడువు ముగుస్తుండడంతో మండలానికి చెందిన పలు గ్రామాల రేషన్ కార్డుదారులు వాగు ప్రవాహంకు అవతలి వైపున తమ గ్రామాలు ఉండడంతో వాగులు దాటి వచ్చే వీలులేక తమ పిల్లల రేషన్ ఈ కేవైసీ ప్రక్రియ పూర్తికాలేదు. రేషన్ కార్డులో ఉన్న తమ పిల్లలు సదూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఈనెల 31 తో తమ పిల్లల ఈ కేవైసీ నమోదు కాకపోతే వారి రేషన్ కోట రద్దయ్యే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి రేషన్ ఈ కేవైసీ ప్రక్రియను మరి కొంతకాలం పొడిగించాలని కోరుతున్నారు.

# శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణల రంగాలలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 30(జనంసాక్షి ): విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనాత్మక ఆలోచనా విధానం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్స్పైర్ - మానక్ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనకు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టవలసిన కీలక కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు చేశారు. 2026--27 లో కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక ఇన్స్పైర్-- మానక్ కార్యక్రమంలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, ఒక్కో పాఠశాల నుంచి కనీసం 5 ఉత్తమ ఆవిష్కరణలను నామినేట్ చేయాలని, ఆగస్టు 20, 2026 నాటికి జిల్లాలోని 100 శాతం పాఠశాలల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్--2026 లో భాగంగా ఈ సంవత్సరం సుస్థిరత కోసం సైన్స్ ఆవిష్కరణలు అనే ఇతివృత్తంతో 10 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. స్థానిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను చూపించే ప్రాజెక్టులను విద్యార్థులతో రూపొందించాలని, ప్రతి పాఠశాల నుంచి కనీసం 1, గరిష్టంగా 5 నాణ్యమైన ప్రాజెక్టులను నమోదు చేయాలని తెలిపారు. ఏక్ పేడ్ మా కే నామ్--2026 లో భాగంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట ఒక మొక్కను నాటాలని, ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని గ్రీన్ టీచర్ గా నియమించి, మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యత అప్పగించాలని తెలిపారు. ఈకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ పోటీలలో జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి 100 శాతం పాల్గొని ఆన్‌లైన్ సర్టిఫికెట్లు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరగతి ఉపాధ్యాయులు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు ఈ 4 కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలుగా భావించి సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసి, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జిల్లాను శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి వివేక్



రామకృష్ణాపూర్, జులై 30(జనంసాక్షి): రెండు రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు క్యాతనపల్లి మున్సిపాలిటీలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్థానిక ఏడవ వార్డులో వరద ముప్పు ప్రాంతాలను గురువారం పరిశీలించారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న ప్రజలు మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టే విధంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, కార్యదర్శి గోపతి బానేష్, పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్, కౌన్సిలర్ కూతురు ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి యాకూబ్ అలీ, పల్లె రాజు, నాయకులు ఉన్నారు.

# వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

## లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశం



కడెం: జులై 30(జనం సాక్షి) గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కడెం ప్రాజెక్టులో నీటి నిల్వ పెరగడంతో వరద ప్రవాహం అధికమైంది. ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం భారీ వర్షంలోనే ప్రాజెక్టు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్న పరిస్థితిని అధికారులతో కలిసి సమీక్షించిన ఎమ్మెల్యే, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడెం మండల అధ్యక్షుడు బొడ్డు గంగన్న, నిర్మల్ డీఆర్‌డీఓ విజయలక్ష్మి, కడెం ప్రాజెక్టు ఈఈ ప్రవీణ్ కుమార్, మండల తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్, ఎంపీడీఓ అరుణ, పెద్దూర్--కడెం గ్రామ సర్పంచ్ దీకొండ విజయ్ కుమార్, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ముంపు సమస్యలు

## వెంటనే స్పందించిన సర్పంచ్ ఇబ్రహీం



నెన్నెల జూలై 30 (జనం సాక్షి ) నెన్నెల గ్రామ పంచాయతీ పరిధిలో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల ముంపు సమస్యలు తలెత్తాయి. ఇండ్లలోకి వర్షపు నీరు చేరుతోందని సమాచారం అందిన వెంటనే గ్రామ సర్పంచ్ ఎం.డి. ఇబ్రహీం స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షాల కారణంగా కుమ్మరి వాగు ప్రాజెక్టు నుంచి పెద్ద చెరువుకు వెళ్లే కట్టు కాలువ దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలియజేయడంతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్, జేసీబీ సహాయంతో మట్టిని తరలించి కట్టను బలోపేతం చేశారు. దీంతో కాలువ తెగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బెస్తవాడ, సుంకరివాడ ప్రాంతాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో జేసీబీ సహాయంతో కాలువలను శుభ్రం చేసి నీరు సాఫీగా పెద్ద చెరువులోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులకు ఉపశమనం లభించింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

## ఈ-కేవైసీ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి



**గోవిందరావుపేట, జూలై 30 ( జనం సాక్షి)** గోవిందరావుపేట మండలంలో రైతుల ఈ-కేవైసీ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 85 శాతం మంది రైతులు ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకోగా, ఇంకా 15 శాతం మంది రైతులు మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పెండింగ్ జాబితాలో ఉన్న రైతులందరూ ఆలస్యం చేయకుండా వెంటనే ఈ-కేవైసీ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తి చేయని రైతులు యూరియా బుకింగ్‌తో పాటు ప్రభుత్వం అందించే వివిధ వ్యవసాయ పథకాల ప్రయోజనాలను పొందలేరని అధికారులు హెచ్చరించారు. అందువల్ల ఇంకా నమోదు చేసుకోని రైతులు సమీప వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం లేదా సంబంధిత సేవా కేంద్రాన్ని సంప్రదించి వెంటనే ఈ-కేవైసీ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

## మాజీ ఎమ్మెల్యే పెద్దిని పరామర్శించిన మాజీ జడ్పిటిసి



**చెన్నారావుపేట, జూలై 30 ( జనం సాక్షి):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని చెన్నారావుపేట మాజీ జడ్పిటిసి బానోతు పత్తి నాయక్ పరామర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించి అయన సతీమణి పెద్ది స్వప్నను ఆయన ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట డాక్టర్ బానోతు హరీష్ శంకర్, మాజీ సొసైటీ డైరెక్టర్ పూల్ శంకర్, ఇస్లావత్ రాంధన్, పత్తినాయక్ తండా 5వ వార్డు సభ్యులు బానోత్ రవీందర్, ఇస్లావత్ వెంకన్న, రఘు, జాటోత్ అశోక్, ధారావత్ రవి, పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ



**చెన్నారావుపేట, జూలై 30 ( జనం సాక్షి):** మృతురాలి కుటుంబానికి అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, పాపయ్యపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఉప్పరి కొమురయ్యలు ఆర్థిక సహాయంగా బియ్యాన్ని పంపిణీ చేశారు. మండలంలోని పాపయ్యపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందాల వెంకన్న తల్లి కందాల పద్మావతి అనారోగ్యంతో మరణించింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు.. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు. ఉప్పరి వీరస్వామి, తాళ్ల సమ్మయ్య, మండల రవి, వార్డ్ సభ్యులు మేడి సంతోష్, కన్నం మదార్, మొర్రి వీరస్వామి, అన్న బోయిన అనిల్, కంచ ప్రభాకర్, మండల మైనార్టీ ఉపాధ్యక్షులు ఖాజా పాషా, స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

### సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య.



**గూడూరు,జులై30(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రొఫెసర్ జయశంకర్ కృషి వల్లనేనని సాధ్యమైందని, సమాజమంతా అతనికి రుణపడి ఉండాలని సామజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య అన్నారు. గురువారం గూడూరు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ 92వ,జయంతి ఉత్సవాల్లో భాగంగా ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ ఆగస్టు 6న వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్డిఎల్ సిఇ హాల్లో జరిగే సెమినార్ ను విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రిటైర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ మహబూబాబాద్ అంబాల అంబరీష్ హాజరై మాట్లాడుతూ ఈ ఫోటో ఎగ్జిబిషన్లో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ యొక్క విద్యార్థి దశ నుంచి తెలంగాణ ఉద్యమ ప్రస్థానం వరకు సంపూర్ణంగా ఛాయాచిత్రాల ప్రదర్శన కలదు.తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ ఇచ్చిన బావజల వ్యక్తికరణ కోట్లాదిమంది తెలంగాణ ఉద్యమకారులను చైతన్యపరిచిందని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జయశంకర్ సార్ కృషి వల్లనేనని, తెలంగాణ పౌర సమాజమంతా సార్ కు రుణపడి ఉందని, ఆయనను స్మరించుకోవడం ఆయన బావాజలాన్ని రాబోయే తరాలకు అందించే బాధ్యత మన అందరిదని తెలిపారు. పార్నంది రామయ్య మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు, జయశంకర్ వెంట ఆయన ఆలోచనలతో నడిచిన యావత్ ప్రజాసంఘాలు, కుల సంఘాలు,ఇతర వ్యక్తులు సంస్థలు సమూహాలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ల వెంకన్న,మండల నాయకులు చుంచ బాలయ్య,గుండగాని కృష్ణమూర్తి,జన్ను సారయ్య,అంబేద్కర్ యువజన సంఘం నాయకులు,సృజన్ రావు తంగళ్ళపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వానలతో అలెర్ట్‌గా ఉండాలి : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ విజ్ఞప్తి చేశారు. రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా వాగులు, వంకలు, చెరువులు, నదులు, కల్వర్టులు, లో-లెవల్ బ్రిడ్జిల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని హెచ్చరించారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా వరద ప్రభావిత ప్రాంతాలు, లో-లెవల్ బ్రిడ్జిల వద్ద జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని ఎస్పీ వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 కు సమాచారం ఇవ్వాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి దిగవద్దని, చేపల వేట పేరుతో వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. నీటిలో మునిగిన కల్వర్టులు, వంతెనలను దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. పశువులను మేతకు తీసుకెళ్లేటప్పుడు, వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసించవద్దని, అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. వాహనాల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించవద్దని, సెల్ఫీలు, రీల్స్ కోసం వరద ప్రాంతాలు, వాగులు, చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, విపత్తు నిర్వహణ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు.

## దాతృత్వం చాటిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు వినయ్ రావు



**పాలకుర్తి. జూలై 30 (జనంసాక్షి)** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు తిరుపతి కుటుంబానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం పాలకుర్తి మండలంలోని నర్సింగాపురం తండకు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు బదావత్ తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాన్ని గురువారం జనగాం జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు బాధిత కుటుంబాన్ని సందర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ,ఓదార్చుతూ ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, తాము ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించి ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భానోత్ మహేందర్ నాయక్.జోగు గోపి.మామిండ్ల శోభన్ బాబు.లకావత్ సురేష్ నాయక్. పందిరిబోయిన శ్రావణ్.లకావత్ వెంకట్ నాయక్. బీరెల్లి రవి వర్మ. లకావత్ నాగరాజు నాయక్. కడుదుల సంపత్. కుమార్ స్వామి,తదితరులు ఉన్నారు.

## పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



**కాళేశ్వరం , జూలై 30 , ( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వల్ల మరియు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే వర్షపు నీరు వచ్చి చేరడంతో గోదావరి , ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుత నీటిమట్టం 7.6 మీటర్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో చుట్టుపక్కల ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని , భక్తులు నది లోతుకు వెళ్లి స్నానం చేయరాదని అధికారులు సూచించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచన

- కాగజ్ నగర్, దహెగాం, పెంచికల్పేట్ పరిసర ప్రాంతాల్లో ముంపు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన.
- పోలీస్ అధికారులకు సిబ్బందికి ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలకు విధుల పట్ల ప్రత్యేక సూచనలు.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 30(జనంసాక్షి ):** జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలు, పొంగిపొర్లుతున్న వాగులు, లో లెవెల్ వంతెనల ప్రాంతాలను పరిశీలించి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగజ్నగర్, దహెగం, పెంచికల్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరద ప్రాంతాలు వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదకరమైన వంతెనలు పొంగిపొర్లుతున్న వాగుల వద్ద క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది ని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. భద్రత చర్యలో భాగంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసి, లైఫ్ జాకెట్స్ లైఫ్ బాయ్స్, రోప్స్ అందుబాటులో ఉంచుకోవాలని వారికి తగిన సూచనలు అందించారు. విధులు ఉన్న ప్రతి పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవంతరాలు తలెత్తకుండా ప్రజలకు సూచించాలని పొంగిపొర్లుతున్న వాగుల వద్ద జనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని, వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు తెలిపారు. జిల్లాలో ఉన్న వాటర్ ఫాల్స్ కి అనుమతి లేదని ఎవరు కూడా వాటర్ ఫాల్స్‌కు వెళ్లే సాహసం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్, కాగజ్నగర్ రూరల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సైలు రమేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు పోలీసు శాఖ సూచనలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగవద్దు.
- చేపల వేట కోసం వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దు.
- నీటిలో మునిగిపోయిన కల్వర్టులు, వంతెనలు లేదా వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దు.
- పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు నీటి ప్రవాహాలు, విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
- శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించవద్దు.
- అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది.
- వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు.
- సెల్ఫీలు, రీల్స్ లేదా ఇతర వినోదాల కోసం వరద ప్రాంతాలు, వాగులు, చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దు.ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్-- 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# దిలావర్‌పూర్‌లో ప్రత్యేక మండల సమావేశం

**దిలావర్‌పూర్, జూలై 30, (జనం సాక్షి):** ప్రజా సంక్షేమే ధ్యేయంగా దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిడిఓ అరుణ రాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి రాథోడ్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

### విద్య - ఆరోగ్య రంగంలో మండలం దూసుకుపోతోంది

సమావేశంలో విద్యాశాఖపై చర్చిస్తూ మండల విద్యాధికారి పి. సదానందన్ మాట్లాడారు. ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల హాజరు శాతంలో మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచాయని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంచాలని, మధ్యాహ్న భోజన నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. మొదటి తరగతి నుండే ఇంగ్లీష్ మీడియం బోధనకు దృష్టి సారించాలన్నారు, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి గ్రామ సభలు నిర్వహించాలని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి డిప్యూటీ కలెక్టర్ అయ్యానని ఉదాహరణగా చెప్పారు. వైద్యారోగ్య రంగంలో మండలం మంచి ప్రగతి సాధించిందని డా. ప్రియాంక తెలిపారు. పల్స్ పోలియోతో పాటు న్యూఎ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో మండలం జిల్లాలో 2వ స్థానంలో నిలిచిందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి మంగళవారం, శుక్రవారం "డ్రై డే" పాటించి ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,,, రైతు భరోసా:6948 మంది రైతులకు 9.22 లక్షలు -రైతు బీమా: 25 మందికి 1.35 లక్షలు పిఎం కిసాన్: 4152 మంది అర్హులైన రైతులకు 1.39 కోట్లు ఎరువులు: యూరియా 72, డిఏపి 19.5, కాంప్లెక్స్ 114.5, పొటాష్ 19.4 మెట్రిక్ టన్నులు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయనీ, యూరియాతో పాటు ఎరువులకు ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరికి ప్రత్యామ్నాయంగా ప్రతి 10 ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను మళ్లించాలని గ్రాజూ చైర్మన్ పి.వి. రమణారెడ్డి కోరారు. భూగర్భ జలాలను పెంచేందుకు మండల వ్యాప్తంగా ప్రతి గ్రామానికి 10 చొప్పున మొత్తం 60 ఫామ్‌పాండ్లను తవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. విద్యుత్ శాఖ సమస్యల వివరణ



జూలై నెలలో 200 కొత్త స్తంభాలు మార్చామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు, ఓవర్‌లోడ్, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే కాల్వ గ్రామంలో న్యూట్రల్ వైర్ సరిగా లేకపోవడంతో 250 బల్బులు షార్ట్ సర్క్యూట్ అయ్యాయని గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ తరపున తహసీల్దార్ షేక్ అజాజ్ ఖాన్ మాట్లాడుతూ మండలంలో 15 రేషన్ దుకాణాలు, 4230 అంత్యోదయ, 7676 ఫుడ్ కార్డులు ఉన్నాయని, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద 7,021 జాబ్ కార్డులు ఉండగా 6,610 మంది కూలీలు లబ్ధి పొందుతున్నారని అధికారులు తెలిపారు. గృహ నిర్మాణ శాఖపై సమీక్షిస్తూ బంసపల్లిలో 42 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని ఏఈ తెలిపారు. సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకుని బేస్‌మెంట్, రూఫ్ లెవెల్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూజ టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. భవిష్యత్ కార్యాచరణ రాబోయే వర్షాల దృష్ట్యా శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజల రక్షణ కోసం ముందస్తు చర్యలపై శుక్రవారం మరో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. గోదావరి బ్యాక్ వాటర్ ఉన్న గ్రామాల్లో గ్రామస్థాయిలో అవగాహన సభలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ రామణ, ఎంపీఓ గోవర్ధన్, ఇరిగేషన్ అధికారి గంగాధర్, అంగన్‌వాడీ సూపర్వైజర్లతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కొన్ని గ్రామాల సర్పంచ్ లు, శుసంవర్ధక, అటవీ, ఉద్యానవన , ఆర్ఎండి పంచాయతీరాజ్, మత్స్యశాఖ, అధికారులు గైర్హాజరైనందుకు అసంతృప్తి వ్యక్తమైంది. మండలంలో మొదటి పారంపాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చి పూర్తి చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలిచిన గుండంపెల్లి సర్పంచ్ రమణ రెడ్డి నీ శాలువాతో సన్మంచిని అధికారులు .

## ఆగస్టు 1న ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం

### ఇది సంబరాల రోజు కాదు... మన ఉనికిని కాపాడుకునే పోరాట దినం



**తాండూర్, జులై 30(జనం సాక్షి)** నల్ల బ్యాడ్జీలు ధరించి తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికులు ఉన్నారని మరిచిపోయిన రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తు చేయడం కోసం అయినా మనము చందాలు పోగేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తెలంగాణ రాష్ట్రంలోని ఆటో కార్మికుల ఐక్యతను చాటుకోవాలి తాండూర్ మండల్ ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహమ్మద్ హబీబ్ పాషా పిలుపునిచ్చారు.

## మన గ్రోమోర్ వ్యాపార కేంద్రాన్ని ప్రారంభించిన ఏరియా మేనేజర్ భానుప్రకాశ్

### జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటి సర్పంచ్ కొడప ప్రకాష్ సీఐ రమేష్




**జైనూర్, జూలై 30(జనం సాక్షి)** మండల కేంద్రంలో రైతులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో కోరమాండల్ సంస్థకు చెందిన 'మన గ్రోమోర్' వ్యాపార కేంద్రాన్ని ప్రారంభించారు. వ్యవసాయ శాఖ వెంకట్ స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రోమోర్ అధికారులు మాట్లాడుతూ.. తమ కేంద్రం ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, సాంకేతిక సలహాలతో సహా వ్యవసాయానికి అవసరమైన అన్ని సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కేంద్రం వల్ల పంట దిగుబడిని పెంచుకునేందుకు రైతులకు సహాయం లభిస్తుందివ్యవసాయ రంగానికి మరింత సాంకేతిక సహకారాన్ని, నాణ్యమైన సేవలను అందించే లక్ష్యంతో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'మన గ్రోమోర్' వ్యాపార కేంద్రం కొమురం భీం జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో ఈ నూతన కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ భానుప్రకాశ మార్కెటింగ్ మేనేజర్ దేవరాజ్ ఎఫ్ఏసి కనక శ్రీనివాస్ సందీప్ సంతోష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల వల్ల ప్రజలకు అసౌకర్యాలు కలుగకుండా మున్సిపల్ చర్యలు




**నిర్మల్ బ్యూరో, జూలై 30:( జనంసాక్షి)** నిర్మల్ పట్టణంలో కురుస్తున్న ఎడతెరిపి వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోంది. వార్డ్ నెం.14 పరిధిలోని సోఫీనగర్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి వెంటనే అధికారులను అప్రమత్తం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న సుమారు 15 పైపులను తొలగించారు. దీంతో నిలిచిపోయిన వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా మార్గం ఏర్పడి, స్థానిక ప్రజలకు వెంటనే ఉపశమనం లభించింది. పట్టణంలో ఎక్కడైనా వర్షాల కారణంగా డ్రైనేజీ, నీటి పారుదల సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆర్షియా తబస్సుమ్ (తాహిర్ పటేల్), డీఈ హరిభువన్, కాలనీ వాసులు అక్బర్ ఖాన్, అబ్దుల్ నిజాం, అఫ్ఫాన్ షా తదితరులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారూ.

## భూపతిపూర్ గ్రామంలో ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి



**ఏటూరునాగారం, జులై 30(జనంసాక్షి).** కన్నాయిగూడెం మండలంలోని భూపతిపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి గురువారం పరిశీలించారు. చిట్యాల గ్రామం నుంచి భూపతిపూర్ గ్రామానికి పోలింగ్ కేంద్రాన్ని మార్పు చేసే ప్రతిపాదన సందర్భంగా పోలింగ్ స్టేషన్ పరిస్థితులను పరిశీలించి, పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, మరుగుదొడ్లు, భవనం పరిస్థితి తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. భూపతిపూర్ గ్రామ ప్రజలతో మాట్లాడి, పోలింగ్ కేంద్రాన్ని చిట్యాల గ్రామం నుంచి భూపతిపూర్‌కు మార్చడంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓటర్లకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కిషోర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ఈజీఎస్ సిబ్బంది నిరసన




**పాలకుర్తి, జూలై 30(జనంసాక్షి)** వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకంలో ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఉద్యోగులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఇరవై ఏళ్ల నుంచి ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ సిబ్బందికి ఉద్యోగ ఆరోగ్య భీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను తక్షణమే అమలు చేయకుంటే దశలవారి ఉధ్యమాలు చేపడుతాని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అంబాల మంజుల, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏలు కొంరయ్య, ఇంద్రయ్య, శ్రీనివాస్, రజనీ, కంప్యూటర్ ఆపరేటర్లు యాకూబ్, రమేష్, అటెండర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సమాన పనికి.. సమాన స్టైఫండ్

- ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- ఆయుర్వేద కళాశాల హౌస్ సర్జన్స్ నిరసన



**వరంగల్ బ్యూరో, జూలై 30 (జనం సాక్షి)** తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్టైపెండ్ పెంపు డిమాండ్‌తో నల్ల బ్యాడ్జీలు ధరించిన వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల హౌస్ సర్జన్లు తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో, వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల హౌస్ సర్జన్లు స్టైపెండ్ పెంపు డిమాండ్ సాధనలో భాగంగా గురువారం విధులు నిర్వహిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయుష్ హౌస్ సర్జన్లు ఆధునిక వైద్య (అల్లోపతి) హౌస్ సర్జన్లతో సమానంగా రోగులకు సేవలందిస్తూ, అత్యవసర విధులు, వార్డులు, ఓపీలు మరియు ఇతర వైద్య సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ, స్టైపెండ్ విషయంలో తీవ్ర వివక్ష కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "సమాన పనికి -- సమాన స్టైపెండ్" అనే ప్రధాన డిమాండ్‌తో ఈ నల్ల బ్యాడ్జీల నిరసన చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయుష్ హౌస్ సర్జన్ల స్టైపెండ్‌ను అల్లోపతి హౌస్ సర్జన్లతో సమానంగా పెంచడంతో పాటు బకాయిలను విడుదల చేసి, ప్రతి నెలా సకాలంలో స్టైపెండ్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఇప్పటికే ప్రకటించిన ఆందోళన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవర్చుకోవాలి
- నార్కోటిక్స్ డిఎస్పి రమేష్ కుమార్




**వరంగల్ ఈస్ట్, జూలై 30 (జనం సాక్షి)** యువత తమ అమూల్యమైన జీవితాన్ని మత్తు పదార్థాలు, మద్యం, గుట్కా, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు బలి చేయకుండా, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని తెలంగాణ నార్కోటిక్స్ డీఎస్పీ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వాగ్దేవి కళాశాలలో మైభారత్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించబడిన నశాముక్త భారత్ ఫర్ విద్యుత్ భారత్ అనే అంశం పై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ రమేష్ కుమార్ మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న వ్యసనాల దుష్పరిణామాలను వివరించి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు మంచి విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తిని పెంపొందించుకోవాలని, చట్టాలను గౌరవిస్తూ ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ శశిధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కళాశాల నిరంతరం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మై భారత్ వరంగల్ జిల్లా అధికారి భూక్య సంజీవ్ మాట్లాడుతూ యువతకు ప్రభుత్వ యువజన కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ యూత్ అవార్డు గ్రహీత మండల పరశు రాములు, డాక్టర్ ఆకులపల్లి మధు, డాక్టర్ శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మొహమ్మద్ అలీ, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవి విరమణ సోమారపు ఐలయ్య



**పెద్దవంగర జులై 30(జనం సాక్షి )** పదవి విరమణ ప్రధానోపాధ్యాయుడు సోమారపు ఐలయ్య,ఉద్యోగ విరమణ అభినందన సభ గురువారం మండలంలోని బావోజీ తండ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యా శాఖ బుదారపు శ్రీనివాస్, ఆధ్వర్యంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సుధీర్గ కాలంగా పెద్దవంగర మండలంలో పని చేసి విద్యార్థులకు విశిష్ట సేవలు అందించారన్నారు.. చిన్నతనం నుండి జూపి డి ఎస్లో యూ చేరి విద్యార్థి సమస్యల ఉద్యమించా రన్నారు.. అదేవిధంగా సామాజిక సమస్య ల పట్ల అనేక ఉద్యమం లు చేసారని విద్యా రంగం, ఉపాధ్యాయ సమస్యల పట్ల పోరాడారన్నారు.. మిగిలిన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.తరువాత సోమారపు ఐలయ్య, మాట్లాడుతూ విద్య ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుకోవాలంటే ఉపాధ్యాయ వర్గం చైతన్యవంతమై విద్య వ్యవస్థ పట్ల ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వాలు చూపే ఆశాస్త్రీయ విద్యా విధానాలను మరియు ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వాలు చూపే వివక్షతలకు వ్యతిరేకంగా అన్ని సంఘాలు సన్నిహితమై ఉద్యమాలను చేస్తే తప్ప హక్కులను విద్యావ్యవస్థను కాపాడుకోలేమని అన్నారు అంతేకాకుండా సమాజం పట్ల ఉపాధ్యాయులు అవగాహన కలిగి సమస్యల పట్ల సమాజంలో కూడా ఒక భాగస్వాములుగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ప్రకళాధర్ వివిధ సంఘాల మండల బాధ్యులు యాకుబ్ పాషా,చిక్కాల సతీష్,ఎర్ర వెంకన్న,మధుసూదన్ రెడ్డి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేకు ప్రజల సహకారం తప్పనిసరి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గంలో భూ సర్వే గ్రామసభలు జోరుగా సాగుతున్నాయి. గురువారం గోరికొత్తపల్లి, మొగులపల్లి మండలాల్లో జరిగిన గ్రామసభలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోరికొత్తపల్లి మండలంలోని చెన్నాపూర్, కోనరావుపేట, జంషెట్బేగపేట రెవెన్యూ గ్రామాల భూ సర్వే గ్రామసభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ భూ సర్వేకు ముందు గ్రామ ప్రజలకు నోటీసులు అందజేసి పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రైతు, ప్రతి కుటుంబం ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సర్వే ద్వారా భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారించబడటంతో పాటు, ఒకరి పేరుపై ఉన్న భూమిని అసలు యాజమాని పేరుకు మార్చే అవకాశం కలుగుతుందని వివరించారు. అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందజేయడం ద్వారా రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా మొగులపల్లి మండలంలోని రంగాపురం రైతు వేదికలో రంగాపురం, అంకుశంపూర్ గ్రామాలకు, ములకలపల్లి రైతు వేదికలో ములకలపల్లి, వేములపల్లి రైతు వేదికలో వేములపల్లి, గుడిపాడు, గుండ్లకర్తి గ్రామాలకు సంబంధించిన భూ సర్వే గ్రామసభల్లోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే ద్వారా గ్రామాల సరిహద్దులు, రైతుల భూముల హద్దులు శాశ్వతంగా నిర్ధారణ అవుతాయని, నిజమైన భూ యజమానులకు ఖచ్చితమైన పట్టా పాస్‌బుక్‌లు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గతంలో ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా భూ సర్వే నిర్వహిస్తోందని పేర్కొన్నారు. రైతు పట్టా పాస్‌బుక్ ఆధారంగానే రైతు భరోసా, ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల అమలు, వరి, మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటల విక్రయం జరిగేలా ఈ సర్వే ఉపయోగపడుతుందని వివరించారు. రైతుల హక్కులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా భూ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళలు, రైతులు, యువత, వృద్ధులు, పేద కుటుంబాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. భూ సర్వే గ్రామసభలు అత్యంత ప్రాముఖ్యత కలిగినవని, గ్రామస్తులకు ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ప్యాక్స్ చైర్మన్, గోరికొత్తపల్లి, మొగులపల్లి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏడీ సర్వే అధికారులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది

# ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదు

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత.**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 30(జనంసాక్షి ):** ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజా సంక్షేమ చర్యలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని అడ ప్రాజెక్టును అధికారులతో కలిసి సందర్శించి వరద నీటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో వరద నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రజల రక్షణలో అప్రమత్తంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అడ ప్రాజెక్టులోకి 37 వేల క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా, ప్రాజెక్టులోని 6 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 27 వేల క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అడ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 10.393 టి.ఎం.సి. కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 6.007 టి.ఎం.సి.ల నీరు 238 మీటర్ల మేర ఉందని తెలిపారు. వర్షాలు మరింతగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రాజెక్టు నుండి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున లోతట్టు ప్రాంతాలలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాలలోని వాగులు, కాలువలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, వరద నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలలో ప్రజలు రాకపోకలు సాగించకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన పునరావాసం, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుత వర్షాల పరిస్థితులను జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు కంట్రోల్ రూమ్ నం. 8500844365 లో అత్యవసర సహాయం కొరకు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితేగాని పట్టించుకోరా పొంచి ఉన్న ప్రమాదం



**తాండూర్,జూలై 30(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా: తాండూర్ మండలంలోని సర్సాపూర్ గ్రామపంచాయతీ లోని ఆదివాసీ గ్రామాలకు రాకపోకల బంద్ భీమన్న వాగు నిన్నటి నుంచి కురుస్తున్న వర్షానికి ఉద్రిక్తంగా మారి 15 గ్రామాల ప్రజల రాకపోకలు నిన్నటి నుండి నిలిచిపోయాయి గత సంవత్సరం కూడా ఇలాగే భీమన్న వాగు ఉద్రిక్తత ఉండడంతో ఆదివాసీ మహిళకు పురిటి నొప్పులు రావడం తో నానాతంటాలు పడి ఆసుపత్రికి తరలించిన ఘటన చూసి ఉన్నాం ఆ విషయాన్ని దృష్టిలో పెట్టి 15 గ్రామాల ప్రజలు రిలే నిరహార దీక్ష కూడా కూర్చోవడం 13 రోజులు జరిగింది.పక్కనే ఉన్న సింగరేణి జనరల్ మేనేజర్ మరియు ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి ఆదివాసులకు న్యాయం చేయాలని ఆశిస్తున్నారు.

## ఆవడం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**నెన్నెల, జూలై 30 (జనం సాక్షి )** నెన్నెల మండలం భారీ వర్షాల కారణంగా నెన్నెల మండలంలోని ఆవడం సబ్‌స్టేషన్‌కు శ్రీరాంపూర్ నుంచి వచ్చే 33 కేవీ ప్రధాన విద్యుత్ లైన్ దెబ్బతింది. దీంతో ఆవడం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది లోపాన్ని సరిచేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మరమ్మతు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. పరిస్థితి అనుకూలించిన వెంటనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న గర్భిణీలకు అప్పుడు పౌష్టికహార పంపిణి



**హనుమకొండ ప్రతినిధి జూలై 30 (జనం సాక్షి) :** స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి లో గో ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకారం తో జిల్లాలోని దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న 5 గురు గర్భవతుల కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి , సూపరింటెండెంట్ చేతుల మీదుగా 10 కిలోల రైస్, కందిపప్పు, పప్పు దినుసులు, గోధుమపిండి, బెల్లం, డ్రై ఫ్రూట్స్ వంటి పోషకహార వస్తువులను అందించడం జరిగింది.ప్రతి గర్భవతి మొదటి త్రైమాసికం లోనే అన్ని రక్తపరీక్షలు మరీ ముఖ్యంగా ఇతర ఇతర వంటి దీర్ఘాకాలిక వ్యాధుల పరీక్షలకు చేయించుకొని సరిఅయిన మందులను, పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డకు ఆరోగ్య వంతమైన జీవితాన్ని అందించగలమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. అప్పయ్య పేర్కొన్నారు. గో ఇండియా స్వచ్ఛంద సంస్థ అన్మోల్ కార్యక్రమం ద్వారా చేస్తున్న ఈ కృషిని ఆయన అభినందించారుఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్మోహన్ రావు ప్రతి నెల జీఎంహెచ్ లో 1600 మంది గర్భిణీలకు హెచ్ఐవి తో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారని.. అదేవిదంగా వారందరికీ సకాలంలో ఏ ఆర్ టి సేవలను అందించడం ద్వారా పుట్టే బిడ్డకు రాకుండా నివారించవచ్చు అని తద్వారా సురక్షిత్ ప్లస్ జిల్లా గా చేయవచ్చు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో సూపరిటెండెంట్ డాక్టర్. విజయ లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎంవో. మంజుల, హెచ్ఐవి ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి, డి ఈ ఎం ఓ అశోక్ రెడ్డి, గో ఇండియా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మేరీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిస్ట్రిక్ట్ సూపర్వైజర్ రామకృష్ణ, కమలాకర్, కరుణామైత్రి పాజిటివ్ సర్వీస్ సొసైటీ సిబ్బంది శిరీష, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పాముకాటుకు గురికావడం అవాస్తవం




**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** ఏరియా పరిధిలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను బుధవారం పాముకాటు వేయలేదని, ప్రచారమాధ్యమాల్లో ప్రసారం అయిన వార్తలు అవాస్తవమని,విద్యార్థులను ముందు జాగ్రత్త చర్యలలో భాగంగానే ఆసుపత్రికి తరలించటం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ కూర్మ రాజేందర్ తెలిపారు.విద్యార్థులు మెస్కు వెళుతుండగా వారికి సమీపంలో పాము వెళ్లగా వారు భయాందోళనకు గురయ్యారని,విద్యార్థులు పాము కాటుకు గురికానప్పటికీ ముందస్తు చర్యలలో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అబ్జర్వేషన్లో ఉంచి అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే వారికి జరిపిన వైద్య పరీక్షలలో వారు పాము కాటుకు గురికాలేదని నిర్ధారణ అయినట్లు తెలిపారు. భయాందోళనలో ఉన్న విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచి మనోధైర్యం కల్పించే సదుద్దేశ్యంతో మాత్రమే ఆసుపత్రికి తరలించామన్నారు. విద్యార్థులు పాముకాటుకు గురైనట్లు వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వార్తలు రావటం,ప్రచారాలు జరగటం దురదృష్టకరం అని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

- **మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలి**
- **జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**



**ములుగు ప్రతినిధి, జూలై 30(జనంసాక్షి).** వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్సీ ప్రీ-మెట్రిక్ హాస్టళ్లలో 2026--27 విద్యా సంవత్సరానికి అమలు చేయనున్న వారాంత ఆహార మెనూ పోస్టర్‌ను తన ఛాంబర్‌లో జిల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతిరోజు నిర్ణయించిన ఆహార పదార్థాలనే విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఏ ఎస్ డబ్ల్యూ ఓ సురేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకుర్ గ్రామ పంచాయతీలో పౌర హక్కుల దినోత్సవం



**కుంటాల, జూలై 30(జనం సాక్షి):** మండల పరిధిలోని వెంకుర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక తహసీల్దార్ ఆదే కమల్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో కుల, మత వివక్షకు తావులేకుండా అందరూ సమానత్వంతో మెలగాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలు మరియు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిందే సవిత, ఉప సర్పంచ్ గిర్వర్ జి. రాజేశ్వర్, పిసి దత్తు యాదవ్, జిపిఓ భోజన్న, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రావణ నక్షత్రము మాసా కళ్యాణ మహోత్సవం

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 30 ( జనం సాక్షి ) :చిల్పూర్ మండల కేంద్రంలోని చిల ప్పూర్ గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామిదేవ స్థాన ము లోశ్రావణ నక్షత్ర ము మాసా కళ్యాణ మహోత్సవం ఈవో బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో గురు వారం అర్చకులు ఘనంగా నిర వ్రహించారు. శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రవణనక్షత్రం హోమము స్వామివారి మాసా కళ్యాణం వేదమం త్రోచరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించా రు.వివి ధగ్రామాల నుండి పట్టణాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శ్రీమన్ పొట్లపల్లి శ్రీధర్ రావు , ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ఈవో శ్రీమతి బి .లక్ష్మీ ప్రసన్న, ముఖ్య అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్య లు, కృష్ణమాచా ర్యులు,ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# కలెక్టర్‌రేట్ లో జిల్లాల కలెక్టర్లతో కలసి శాఖల వారీగా సమీక్షించిన ఎమ్మెల్యే

హనుమకొండ ప్రతినిధి జూలై 30. (జనం సాక్షి) : పరకాల నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం హన్మకొండ కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో పరకాల నియోజకవర్గంలో అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల పనుల పురోగతిపై శాఖల వారీగా సవివర సమీక్ష నిర్వహించారు.సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), పరకాల మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, రోడ్లు-భవనాల శాఖ, మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, విద్యుత్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, భూగర్భ జలాల శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్, హౌసింగ్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్‌తో పాటు ఇతర శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని చేపడుతున్న ప్రతి పథకం నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి కావాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో జాప్యానికి ఆస్కారం లేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కజొన్న పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే విధంగా వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో ఉన్న పరకాల నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణాలు పూర్తి చేసేవిధంగా ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు ఎక్కడ అవసరం ఉన్నాయో సంబంధిత శాఖల అధికారులు వివరాల నివేదికను అందజేయాలని రెండు జిల్లాల డీపీవోలు, డీడబ్ల్యూవోలు, జీడబ్ల్యూఎంసీ అధికారులను ఆదేశించారు. వీవో భవనాలను త్వరగా పూర్తి చేయాన్నారు.వీవో భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలు గుర్తించి అందజేయాలన్నారు.వీవో భవనాలు అవసరమైన గ్రామాలను గుర్తించాలన్నారు. గ్రామాలు, ఆవాసాలలో తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా ఇబ్బందులు ఉండొద్దన్నారు. గ్రామాలలో ఉన్న నీళ్ల ట్యాంకులను శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లా ద్వారా నీటిని అందించాలన్నారు. ట్యాప్స్ ఉన్నాయా లేదా పరిశీలించండి అని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు వృథాగా పోవద్దన్నారు. షెడ్యూల్ ప్రకారం నీళ్ల ట్యాంకులను శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, ఎప్పుడు శుభ్రం.చేసే తేదీల రికార్డు నిర్వహించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లు వంద శాతం పూర్తయ్యేటట్టు గృహ నిర్మాణ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. టెక్స్టైల్ పార్కు అభివృద్ధి పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సబ్ సెంటర్లు భవనాల నిర్మాణం కొరకు త్వరగా టెండర్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, శాఖల మధ్య సమన్వయంతో ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, వై వి గణేష్, శేషాద్రి, డిఆర్‌ఓ లు శ్రీనివాస్, విజయలక్ష్మి, ఆర్డీవోలు, తహసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# భారీ వర్షాల వేళ ప్రజలకు అండగా రోహీర్ గ్రామ పంచాయతీ

**గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్**


ఏటూరునాగారం, జూలై 30(జనంసాక్షి).భారీ వర్షాల నేపథ్యంలో రోహీర్ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం గ్రామపంచాయతీ బాధ్యత అని రోహీర్ గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ అన్నారు.గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే గ్రామపంచాయతీకి సమాచారం అందించాలని, ప్రజల సేవ కోసం గ్రామపంచాయతీ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, రోడ్లపై గుంతల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీటిని తప్పనిసరిగా మరిగించి తాగాలని, వర్షాకాలంలో జ్వరాలు, వైరల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా వాగులు, వంకలు, చెరువులు, గోదావరిలో చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని, వర్షాల సమయంలో పాము లు, విషపురుగులు మరియుఇతర ప్రమాదాలు సంభవి ంచే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు, వార్డు సభ్యులు గజ్జల అంకుల్, సోదరి రాజేష్, దొంగిరి రాజశేఖర్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## నిండుకుండల తలపిస్తున్న గోదావరి ఉధృతి

**మేడిగడ్డ బ్యారేజీలో కి 2,12,170. క్యూసెక్కుల వరద నీరు.**

మహదేవపూర్:జూలై 30 (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మంగళవారం నుండి మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మరియు మహారాష్ట్ర ఎగువ నుంచి కాళేశ్వరం ప్రణహిత త్రివేణి సంగమం గోదావరి నదిలో భారీ వర్ద నీరు చేరింది.మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ లో 2, 12,170 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా 85 గేట్లకు గాను 85 గేట్లు ఎత్తి అదే మొత్తంలో అవుట్ ఫ్లో ద్వారా దిగువకు నీటిని వదులుతున్నారు. బారేజీ వద్ద ప్రస్తుత నీటిమట్టం 91,70 మీటర్లు గా ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలు దృష్ట్యా బ్యారేజ్ లో వరద పెరిగే అవకాశం ఉంది. నది పరివాహక ప్రాంత ప్రజలు మత్స్యకారులు గొర్ల కాపలదారులు. అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.



## ఆలయ తొలగింపు పనులకు శ్రీకారం



కాళేశ్వరం , జూలై 30 , ( జనం సాక్షి ). జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ తొలగింపు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. టెండర్ దక్కించుకున్న శివరాం అండ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా పూజలు జరిపి గురువారం ఆలయ తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా దక్షిణ రాజగోపురం వైపు ఉన్న సరస్వతి అమ్మవారి ఆలయ ప్రాకారాన్ని తొలగించి పనులు మొదలుపెట్టారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలనే మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు వర్షం కురుస్తున్న లెక్కచేయకుండా తొలగింపు పనులను ప్రారంభించారు.



## ప్రారంభమైన నగర సంకీర్తన

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 30 ( జనం సాక్షి ) : శ్రీరామ హృదయ స్పర్శ అక్షింతల సేకరణ నగర సంకీర్తన కార్యక్రమం గురువారం సాయంత్రం 5 గంటలకు తిరుమల నాథ స్వామి దేవాలయం నుండి యాద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభం అయినది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి వారి 70 వ జన్మదిన సంద ర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగు తుందని, కలశం మీఇంటికి వచ్చినప్పుడు శ్రీరామ నామం జపిస్తూ కలశంలో అక్షింతలు వేయగలర ని కోరారు. మంచి సంకల్పం తో లోక కళ్యాణం కోసం చేస్తున్న ఈ బృహత్తర కార్యక్రమం లో పాల్గొని చిన్నజీయర్ స్వామి ఆశీస్సులు మంగళ శాసనలు పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆలయ భక్తులు పాల్గొన్నారు.



## 29 ఫీట్లకు చేరిన రామప్ప చెరువు నీటిమట్టం

వెంకటాపూర్(రామప్ప),జూలై30(జనం సాక్షి): -వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులో గల రామప్ప చెరువు నీటిమట్టం గురువారం సాయంత్రం వరకు 29 ఫీట్లకు చేరుకుంది.రామప్ప చెరువు మొత్తం నీటి మట్టం 36 ఫీట్లు ఉండగా,మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామప్ప చెరువులోకి వరద నీరు చేరుకోవడంతో ప్రస్తుతం రామప్ప చెరువు నిండుకుండలా మారింది.అలాగే దేవాదుల పైపులైన్ ద్వారా రామప్ప చెరువు లోకి వస్తున్న నీటి తో రామప్ప చెరువు లో జలకళ సంతరించుకుంటుంది.చెరువు ఆయకట్టు కింద రైతులు సుమారు 5,180 నుండి 10,000 ఎకరాలు పంట పండిస్తారు.దీంతో రామప్ప ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.రెండు పంటలకు ఇంకా డొక లేదంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

- ప్రజల ప్రాణ భద్రతే ప్రథమ ప్రాధాన్యత -అవసరమైతేనే బయటకు రావాలని సూచన
- కుంటాల జలపాతం వద్ద పరిస్థితి పరిశీలన



**నెరడిగొండ జులై30(జనంసాక్షి):** రెండు రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ స్వయంగా పరిశీలించారు. బుధవారం రోజున జైనథ్ మండలం తర్నం గ్రామం సమీపంలోని నేషనల్ హైవే-353బి, తలమడుగు మండలం సుంకిడి,మత్తడి వాగు ప్రాజెక్టు,ఇచ్చోడ మండలం గేర్జం,నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతంతో పాటు ఇతర వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జైనథ్ మండలం తర్నం గ్రామం వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో నిలిచిపోయిన వాహనాల పరిస్థితిని జిల్లా ఎస్పీ పరిశీలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైతే ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని వాగులు వంకలు కల్వర్టులు బ్రిడ్జిలు అండర్ బ్రిడ్జిలు లోతట్టు ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగించాలని, నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది,గ్రామపంచాయతీ సిబ్బంది,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను దాటకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగంపూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. నూతన అత్యాధునిక పరికరాలతో కూడిన (డిడిఆర్ఎఫ్) బృందం 24 గంటలూ అందుబాటులో ఉండి ఎలాంటిఅత్యవసర పరిస్థితినైనాఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని,యువత అత్యుత్సాహంతో జలపాతాలు వాగులు నదులు రిజర్వాయర్లు చెరువుల వద్దకు ఎవరు వెళ్లరాదన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుడదని,రైతులు అన్ని విధాల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,జైనథ్ సీఐ జి శ్రావణ్,ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె నరేష్ కుమార్,ఎస్ఐ పి గౌతమ్ నెరడిగొండ ఎస్ఐ ఇమ్రాన్ పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వాగు ప్రవాహాల వద్ద రక్షణ చర్యలు వేగవంతం





**కెరమెరి, జూలై30 (జనంసాక్షి)** కేరమేరి మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలలకు తుమ్మగూడ, అనర్పల్లి, సాంగ్వి గ్రామపంచాయతీల్లో డిఎల్పిఓ ఉమర్ హుస్సేన్, ఎంఆర్ఓ నాగార్జున గౌడ్ ఎంపీడీఓ అంజద్ పాషా, ఎంపీఓ సాయిగౌడ్, ఎస్సై శ్రీకాంత్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ పవన్ కలిసి అనర్పల్లి,గోర్యగూడ, లక్మాపూర్, సాంగ్వి వాగు ప్రవాహల పరిస్థితులను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా నీటమునిగిన సాంగ్వి, తుమ్మగూడ లో-లెవల్ రహదారి వద్ద ప్రజల రాకపోకలను నిలిపివేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు భద్రతా చర్యల్లో భాగంగా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. తుమ్మగూడ, కరంజివాడ, బోరిలాల్గూడ, సాంగ్వి,కేళి బి గ్రామ పంచాయతీలో గల కోలాంగూడ , గోర్యగూడ, కట్టిగూడ,చిత్తగూడ, గోండుగూడ, పెద్దకరంజివాడ, జనకాపూర్, బోరిలాల్గూడ, లక్మాపూర్‌తో పాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించిన భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వారితో పాటు తుమ్మగూడ సర్పంచ్ కుమ్ర భీమ్రావు, సాంగ్వి సర్పంచ్ విమలబాయి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుజాహిత్ ఖాన్ వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

# ముసురు వానలతో రైతన్న సందడి



**దేవరుప్పుల, జూలై 30 (జనం సాక్షి)** మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వానలు రైతన్నలో కొత్త ఆశలు నింపాయి. వరి, పత్తి పంటల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడడంతో రైతులు పొలాల్లో దుక్కులు సరిచేసి నాట్లు వేసేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల వర్షాభావంతో ఆందోళన చెందిన రైతులు ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లతో భూమిని చదును చేస్తూ, , ఎరువులు సిద్ధం చేసుకుంటూ సాగుకు శ్రీకారం చుడుతున్నారు. మరిన్ని రోజులు ఇదే విధంగా వర్షాలు కురిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముసురు వానలతో పల్లెల్లో వ్యవసాయ సందడి నెలకొని, పొలాలన్నీ మళ్లీ పచ్చదనంతో కళకళలాడనున్నాయి.

## వెంకూర్ వాగును పరిశీలించిన అధికారులు



**కుంటాల, జూలై 30 (జనం సాక్షి):** మండల కేంద్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకూర్ వాగును పరిశీలించి, పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షం తగ్గే వరకు ప్రజలు వాగులు దాటవద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, పిడుగుల ప్రమాదం ఉన్నందున చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. ఏవైనా నష్టాలు సంభవిస్తే వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ పర్యటనలో ఎంపీడీఓ, ఎంపీఓ, ఎంఆర్ఐ, సర్పంచ్ షిండే సవిత తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

**నిర్మల్ జూలై 29 జనం సాక్షి:** జిల్లాలో మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నందున గోదావరి నది పరివాహక ప్రాంతంలో చేపల వేటపై నిషేదం ఉండటం వలన మత్స్య కారులు ఎవరూ కూడా చేపల వేటకు వెళ్ళరాదని, చెరువులు మరియు కుంటల దగ్గర చేపల కోసం వలలు అమర్చిన యెడల తక్షణమే వాటిని తొలగించవలసిందిగా కోరారు. దీన్ని పాటించని యెడల మత్స్యకారుల యొక్క లైసెన్సు మరియు సంఘాల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా గోదావరి పరివాహక మండలాల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మీ గ్రామపరిధిలో టామ్ టామ్ ద్వారా చేపల వేటకు వెళ్లరాదని అందరినీ అప్రమత్తం చేయవలసిందిగా మత్స్య శాఖ అధికారులు తెలిపారు.

# చత్తీస్గడ్ తెలంగాణ రాకపోకలు బంద్

## జాతీయ రహదారికి భారీ వరద నీరు



**వాజేడు జులై 30(జనం సాక్షి)** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 163వ జాతీయ రహదారికి భారీగా నీరు చేరుకొని చతిస్గడ్ తెలంగాణ రాకపోకలు నిలిచిపోయాయి ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని టేకులగూడెం గ్రామం చివారులో ఉన్న రేగు మాగూ వాగుకు భారీగా నీరు వచ్చి చేరుకోవడంతో జాతీయ రహదారి నీట మునిగింది. సమ్మక్క సారక్క బ్యారేజ్ గేట్లు అన్ని ఎత్తడంతో ఈ నీటి ఎద్దటి పెరుగుతుంది.దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి వచ్చింది.కావున ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు వెల్లడించారు

## మైనారిటీ, కేజీబీవీ పాఠశాలలు, మోరంచవాగును సందర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతులు, భోజనం, చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ పాఠశాలలో పరిశుభ్రత, లైటింగ్, బిల్డింగ్ మరమ్మతులు అవసరమని, కేజీబీవీలో బాత్రూంలు, ఫ్యాన్లు, రీడింగ్ హాల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. వర్షాకాలంలో అనారోగ్యాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భూపాలపల్లి - చెల్పూర్ మధ్య మోరంచవాగు ఉధ్ధృతిని పరిశీలించారు. వాగులు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## గోదావరి వరదల నేపథ్యంలో

### లోతట్టు ప్రాంతాల పరిశీలన ఆర్టీఏ మెంబర్ వసంత శ్రీనివాస్



**ఏటూరునాగారం, జులై 30(జనంసాక్షి).** గోదావరి నదికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పరిసర లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలను ఆర్టీఏ మెంబెర్ వసంత శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద పరిస్థితులను నిర్లక్ష్యం చేయకుండా అధికార యంత్రాంగం జారీ చేసే హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, వరద నీటిలోకి వెళ్లే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. పంటలు, పశువుల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలు అత్యంత విలువైనవని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే అధికారులకు సమాచారం అందించి సహాయం పొందాలని ఆర్టీఏ మెంబెర్ వసంత శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్, మండల యూత్ ఉపాధ్యక్షులు ముస్తఫా, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వ సాయితేజ, ప్రశాంత్, టౌన్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ల తరుణ్, కళ్యాణ్, వేణు, మని, సిద్దు, వంశీ, సద్దాం, దినేష్, సర్వ అక్షిత్ కుమార్, పోలెబోయిన గోపాల్, అఖిల్ అఫ్రిది, సాయి, వినాయక్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెగిన రోడ్డును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

● శనిగకుంట మార్గంలో తెగిన రహదారిని పరిశీలన చేసిన కాంగ్రెస్ నాయకులు



**మంగపేట, జూలై 30(జనంసాక్షి) :** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న రహదారులతో ఇబ్బందులు పడుతున్న బాధితులను కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు గురువారం సహచర నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సింహసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పంచాయతీరాజ్ రోడ్డు మార్గంలో శనగకుంట గ్రామానికి వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న వంతెన ప్రక్కన రహదారి తెగిపోయి రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాన్ని వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, యుద్ధప్రాతిపదికన అత్యవసర మరమ్మతులు చేపట్టి తాత్కాలిక రహదారి సౌకర్యాన్ని పునరుద్ధరించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆయన కోరారు. అలాగే నర్సింహసాగర్ గ్రామంలోని ఐబీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వర్షపు బాధితులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుల సమస్యలను నేరుగా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు గాదె శ్రావణ్ కుమార్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, జిల్లా కార్యదర్శి మాసిరెడ్డి వెంకటరెడ్డి, మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ యర్రంగారి సురేష్, ఎస్సీ ఎస్టీ, అట్రాసిటీ మెంబర్ మురుకుట్ల నరేందర్ సీనియర్ నాయకులు కాటిబోయిన నరసింహారావు, మండల మీడియా ఇంచార్జ్ బసారీకారి నాగార్జున్, గూడూరు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు షాపుల్లో ఏరులై పారుతున్న మద్యం

బెల్టు షాపులకు అనుగుణంగా సిట్టింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తూ మందుబాబులను నిర్వాహకులు ఆకట్టు కుంటున్నారు. రెస్టారెంట్ మాదిరిగా అప్పటికప్పుడు ఆహార పదార్థాలు తయారు చేస్తూ నిర్వాహకులు అందజేస్తున్నారు. బెల్టు షాపుల్లోనూ పోటీ పెరగడంతో తమ కష్టమర్లను ఆకర్శించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షాపుల్లోనూ గుడ్డు,ఆమ్లేట్, తదితర ఆహార పదార్థాలను వండి వారికిస్తున్నారు.

**దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం : బెల్టు షాపులకు అనుమతి లేదు. రవి ఎక్సైజ్ సీఐ**



మండలంలో బెల్టు షాపులు ఏర్పాటు చేయడానికి అనుమతి లేదు. కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తున్నాము. బెల్టు షాపులపై దాడి చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

## బైకు ఎద్దును ఢీ కొట్టి మహిళ మృతి



**మహా ముత్తారం జూలై 30 (జనం సాక్షి)** ఊహించని ప్రమాదం జరిగి మహిళ మృతి చెందింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని స్తంభం పల్లి (పీకే) గ్రామానికి చెందిన కోడి సుగుణ(50) ఆమె కాటారం గ్రామానికి బుధవారం తన కూతుర్లను హాస్టల్లో దింపడానికి వచ్చి తిరిగే సాయంత్రం బోర్ల గూడెం గ్రామానికి వచ్చి తన ఇంటికి వెళ్ళుటకు తనకు వరసకు అల్లుడు ఓల్లల రమణయ్య బైకు పైన తన గ్రామానికి వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఒక ఎద్దును ఢీకొని రోడ్డు మీద పడి ప్రమాదం జరిగి రక్త గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతి తొందరగా భూపాలపల్లి లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళగా అక్కడ డాక్టర్లు పరీక్షించి మృతి చెందిందని తెలియజేశారని తెలిపారు. భర్త కోడి పోషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ డి,రాజయ్య తెలిపారు.

## వైద్య, విద్యుత్ శాఖల అధికారుల పనితీరుపై
# మండల సభలో ఆగ్రహం

సమాచారం అందిస్తే సమస్యలను పరిష్కరించడం పట్ల విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీనియర్ లైన్ మెన్ కొమ్మాలు పై గ్రామాలలోని సర్పంచులు దారా రంజిత్, మైదం రాకేష్, భానోత్ విక్రమ్, కుసుమ సతీష్, జినుకల కనకమల్లు, యాట సుధాకర్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భుక్య గోపాల్ నాయక్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. భోజేర్వు గ్రామంలో అంగన్వాడి భవనాన్ని మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ కుసుమ సతీష్ ఐసిడిఎస్ సిడిపిఓ మధురిమను కోరారు. జోజిపేట నారాయణ తండా, 16 చింతల తండా గ్రామాలలో రేషన్ షాపులను ఏర్పాటు చేసి నిత్యవసర సరుకులను అందించాలని ఆ గ్రామాల సర్పంచులు లావుడియా చందు, బానోతు విక్రమ్ లు నాయబ్ తహసిల్దార్ పవన్ కుమార్ ను కోరారు. ఎల్లాయగూడెం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ విధులు నిర్వర్తించడం లేదని పదవికి రాజీనామా చేసి వెళ్లిపొమ్మంటే పోవడం లేదని సర్పంచ్ లు జినుకల కనకమల్లు, బానోతు విక్రంలు ఉపాధి హామీ ఏపీవో అరుణను ప్రశ్నించారు. అలాగే గ్రామాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారుల దృష్టికి సభ్యులు తీసుకువెళ్లారు. వెంటనే గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ అధికారులను కోరారు. ఇది ఇలా ఉండగా చెన్నారావుపేట మండలంలో 30 గ్రామాల సర్పంచులకు 16 గ్రామాల సర్పంచ్ లే హాజరయ్యారు. మిగితా 14 గ్రామాల సర్పంచులు హాజరు కాలేదు. గ్రామాల అభివృద్ధిపై వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ మధురిమ, ఎంపీఓ తండ జగదీష్, నాయబ్ తహసిల్దార్ పవన్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ, పశు వైద్యాధికారి జునేద్ ఖాన్, సిహెచ్ఓ భద్రయ్య, ఏపీవో అరుణ, మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ రణధీర్, గ్రిడ్ ఏఈ వంశీ, ఏపిఎం తిలక్ కుమార్, హౌసింగ్ ఏఈ భవ్య శ్రీ, సీనియర్ లైన్మెన్ కొమ్మాలు, పిఆర్ ఏఈ ఉదయ్ కుమార్, హార్టికల్చర్ అధికారి తరుణ్, ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ కుమార్, స్వచ్ఛభారత్ మిషన్ ఐఇసి శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ, సూపరిండెంట్ ఆయేషా పర్వీన్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, జూనియర్ అసిస్టెంట్ లు అనిల్ కుమార్, షాదాబ్, సర్పంచులు దార రంజిత్, మైదం రాకేష్, బానోతు విక్రమ్, గుగులోతు బాలు నాయక్, భూక్య లావణ్య, జినుకల కనకమల్లు, ధారావత్ రమేష్, భూక్య బుజ్జి, జాటోత్ పట్నీ, యాట సుధాకర్, లావుడియా చందు, చిలపాక అనిత, కుసుమ సతీష్, బోడ వీరా సింగ్, భూక్య ఉమ, బానోతు శారద, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరణకు సహకరిస్తా

● ఎస్పీ శబరీష్
● టీఎస్ జేయు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత



**మహబూబాబాద్, జూలై 30 (జనంసాక్షి) :** జర్నలిస్టుల దాడుల నివారణ సంబంధించిన కమిటీని త్వరలో పునరుద్ధరణకు సహకరిస్తానని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగొని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ యూనియన్ జిల్లా నాయకులు కలిసి జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని జిల్లా ఎస్పీ డా.శబరీష్‌కు అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీనీ పునరుద్ధరించడానికి కావలసిన విధి విధానాలను సమీక్షించి కమిటీ ఏర్పాటుకు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్రగొని ఉదయ్ దీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3న కొబ్బరికాయలు, పూజ సామాగ్రి విక్రయాల వేలం



**వెంకటాపూర్ (రామప్ప) జూలై30 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట లోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం లో 03 ఆగస్టు 2026 సోమవారం రోజున కొబ్బరికాయలు,పూజా సామాగ్రి హక్కుల కోసం బహిరంగ వేలం ను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఇమ్మడి భాస్కరు తెలిపారు.ఈ వేలం లో పాల్గొనేవారు 1,50,000రూ.లు ధరావత్ చెల్లించాలని సూచించారు. వేలం కాలపరిమితి ఒక సంవత్సరం ఉంటుందని, ఆసక్తి గలవారు 100 రూపాయలు చెల్లించి ఆలయ కార్యాలయంలో టెండర్ దరఖాస్తు పొందాలని కోరారు.

# బాధిత మహిళలకు భరోసా కలిగించాలి

● క్రైమ్ ఏసిపి సదయ్య
● మహిళా పోలీస్ స్టేషన్-2 తనిఖీ



**వరంగల్ ఈస్ట్, జూలై 30 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగంపేట మహిళా పోలీస్ స్టేషన్-2ను వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైమ్స్ ఏసీపీ సదయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, బాధిత మహిళలకు అందిస్తున్న సేవలు, పెండింగ్ కేసులు, ప్రస్తుత దర్యాప్తులో వున్న కేసులు, నిందితుల అరెస్ట్, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళల ఫిర్యాదులను అత్యంత సున్నితంగా, గౌరవప్రదంగా స్వీకరించి, వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా బాధిత మహిళలకు భరోసా కల్పిస్తూ వారికి అవసరమైన సహాయం అందించాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళతో మర్యాదపూర్వకంగా, సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, పరిశుభ్రత, క్రమశిక్షణ పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్-2 ఇన్‌స్పెక్టర్ సువర్ణతో పాటు ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మహా ముత్తారం (అడవి ముత్తారం)ఎస్సై రమేష్**



**మహా ముత్తారం జూలై 30 (జనం సాక్షి) :** గ్రామాల ప్రజలు భారీ వర్షాల ప్రభావం వల్ల గ్రామాలలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త పడాలని మహాముత్తారం(అడవి ముత్తారం) ఎస్సై గొర్ల రమేష్ తెలిపారు. గురువారం రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మహా ముత్తారం మండలం 24 గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు తగు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మీ అత్యవసర పరిస్థితిని బట్టి బయటకు రావద్దని తెలిపారు. గ్రామాలకు అందుబాటులో ఉన్న చెరువులకు కుంటలకు వాగుల వంకల వద్దకు చేపలు పట్టేందుకు ఎవరు వెళ్ళవద్దని నీటి ప్రవాహం చాలా ప్రమాదకరంగా ఉంటుందని గ్రామాలలో పశువులు కాసే కాపరీలు దూరం మేతకు పశువులను తీసుకు వెళ్లకుండా గ్రామాలలో అందుబాటులో ఉంచే విధంగా చూసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నెంబర్ కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషను సంప్రదించాలని సూచించారు.

# మేడిపల్లి టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి నిబంధనలు అమలు చేయాలి

- కనీస వసతులు లేని టోల్ ప్లాజా
- డబ్బుల కొరకే పుట్టినట్లుంది ఈ టోల్ ప్లాజా
- అప్పల భూమేష్ యాదవ్



కాటారం జూన్ 30 (జనం సాక్షి ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం పరిధిలోని చీఎ-353జ మేడిపల్లి టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారుల నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసి, ప్రయాణికులకు అవసరమైన అన్ని కనీస సౌకర్యాలను తక్షణమే కల్పించాలని స్థానిక యువ నాయకుడు అప్పల భూమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మేడిపల్లి టోల్‌ప్లాజా వద్ద స్థానిక ప్రజలు, వాహనదారులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టోల్ రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రయాణికులకు అందించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో టోల్ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. టోల్‌ప్లాజా వద్ద ఉచిత తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఫస్ట్ ఎయిడ్ కేంద్రం, అత్యవసర అంబులెన్స్, క్రేన్, సరిపడా సిబ్బంది వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ, అవి సక్రమంగా లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే టోల్ కౌంటర్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోవడం, వంద మీటర్లకు మించి వాహనాల క్యూలు ఏర్పడినప్పటికీ అదనపు లేన్లు ప్రారంభించకపోవడం జాతీయ రహదారి నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో టోల్‌ప్లాజా వద్ద సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు సమీప గ్రామాల్లోకి చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భూమేష్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. టోల్ వసూళ్లలో చూపుతున్న శ్రద్ధను రహదారి నిర్వహణ, డ్రైనేజీ నిర్మాణం, వర్షపు నీటి పారుదల, ప్రయాణికుల భద్రత వంటి అంశాల్లో కూడా చూపాలని డిమాండ్ చేశారు. టోల్ వసూలు చేస్తున్న రహదారులను నాణ్యంగా నిర్వహించడం, గుంతలను వెంటనే పూడ్చడం, ప్రయాణికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం టోల్ యాజమాన్యం బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఎన్హెచ్ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని వారం రోజుల్లోగా టోల్‌ప్లాజా వద్ద ఉన్న లోపాలను సరిదిద్ది, జాతీయ రహదారి నిబంధనలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని భూమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, ప్రజాసంఘాలతో కలిసి 'టోల్ ఫ్రీ ఉద్యమం' చేపట్టి టోల్ వసూళ్లను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## లైసెన్స్ లేని బేకరీలపై కొరడా

- రూ. 85వేలు జరిమానా విధించిన అధికారులు..



జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి): జిల్లాలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆహార భద్రతా అధికారి వరుణ్ రెడ్డి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు లేకుండా బేకరీ నడుపుతున్నందుకు ఒక బేకరీకి రూ.10,000 జరిమానా విధించారు. అలాగే వేరుశెనగలు, శనగపప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వంటి నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న వివిధ దుకాణాలు, రిలయన్స్ సంస్థ, రెస్టారెంట్లపై కలిపి రూ.75,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆహార వ్యాపారంలో నిమగ్నమైన ప్రతి వ్యాపారి తప్పనిసరిగా ఆహార భద్రతా లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, కల్తీ లేని ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.



## విద్యనాథును ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

బచ్చన్నపేట జూలై 30 (జనం సాక్షి): జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యనాథ్ జన్మదిన వేడుకలు బచ్చన్నపేట మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు మసూద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జనగామ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి విద్యనాథును శాలువతో సన్మానించి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపి దీవించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పరిశుభ్ర పల్లె నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం కీలకం

ఎంపీడీవో మేనక పాడేల్



దేవరుప్పుల, జూలై 30 (జనం సాక్షి) దేవరుప్పుల మండలం చిన్నమడూర్ గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తతో పాటు ఇతర వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహిస్తున్న విధానాన్ని ఎంపీడీవో మేనక పాడేల్ పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త వేరు చేసే ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన పల్లెల నిర్మాణం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి గ్రామస్తుడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానను సందర్శించి అక్కడి సౌకర్యాలు, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# చెట్టు కొమ్మలను కొట్టి ప్రజలను ప్రమాదం నుంచి తప్పించిన సర్పంచ్



కడెం, జూలై 30 (జనం సాక్షి) : కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామం నుంచి కడెం వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన గాలివానకు ఓ భారీ చెట్టు కొమ్మ విరిగి రహదారిపై ప్రమాదకరంగా వేలాడింది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న పెద్ద బెల్లాల్ గ్రామ సర్పంచ్ ఈదుల తిరుపతి వెంటనే స్పందించి గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్టు కొమ్మలను యంత్రాలు, కార్మికుల సహాయంతో తొలగించి రహదారిని పూర్తిగా శుభ్రం చేయించారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో గ్రామ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరిస్తున్న సర్పంచ్ ఈదుల తిరుపతిని స్థానికులు అభినందించారు. గ్రామంలో ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే గ్రామపంచాయతీకి సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.

# వర్షానికి నీట మునిగిన కాలనీలు

సందర్శించిన ఎస్ ఐ సాయికుమార్



దస్తురాబాద్, జూలై 30 (జనంసాక్షి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం లోని బుట్టాపూర్ గ్రామంలో కొన్ని కాలనీలు జలమయం అయ్యాయని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ ఐ సాయికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి కాలనీ వాసులతో మాట్లాడడం జరిగిందని ఆయన అన్నారు. ఆయన మాట్లాడుతూ వర్షానికి వాగు పొంగి కాలనీలకు నీరు రావడంతో కాలనీ మొత్తం నీటితో నిండి పోయిందని, దీని వల్ల ఇళ్లలోకి నీరు వచ్చి ఇంటి లోపలి సామాను మొత్తం తడిసి ముద్దయిందని ఆయన అన్నారు. కాలనీ వారితో మాట్లాడి జేసీబీ సహాయంతో వాగుకి గండి కొట్టి నీటిని వేరే పక్కకు పంపడంతో కాలానికి నీటి ప్రవాహం తగ్గిందని ఆయన అన్నారు. నీటి ప్రవాహం తగ్గే వరకు అక్కడే కాలనీ వాళ్లతో ఉన్నామని ఆయన అన్నారు. సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ అధిక వర్షం కారణంగా వాగు పొంగి కాలనీలకు నీరు రావడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ మా ఊరుకి వచ్చి మోకాలు వరకు వచ్చిన నీటిలో మాతో పాటు ఉండి సమస్యను పరిష్కారం చేపించారని తెలిపారు. గ్రామస్తుల అందరి తరుపున ఆయనకు ధన్యవాదములు తెలిపారు.

# సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు

తాండూర్, జూలై 30(జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా : తాండూరు మండలం గోపాల్ నగర్ గ్రామ పంచాయతీలో సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సగ్రమ భూ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు దీర్ఘకాలిక లాభాలు కలుగుతాయని, భూముల కొలతలు కచ్చితంగా నమోదు చేయడం వల్ల భవిష్యత్‌లో రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాట్ల నర్సయ్య, ఆర్ఐ బొలిశెట్టి పద్మజ, సర్వేర్ రామకృష్ణ, కార్యదర్శి సౌందర్య, రైతులు పాల్గొన్నారు.

## బాసర హాస్టళ్లలో అధికారుల ఆకస్మిక తనిఖీ

బాసర, జూలై 30(జనం సాక్షి) : బాసరలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో బుధవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీవో దేవేందర్ హాస్టళ్లను సందర్శించి వసతులు, పారిశుద్ధ్యం, భోజన నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేసి ఆహారం రుచి, నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన మరియు పోషకాహారం అందించాలని వంట సిబ్బందికి, వార్డెన్లకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన అధికారులు, వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చదువు, వసతి, మంచినీరు, మెడికల్ సదుపాయాలకు సంబంధించి విద్యార్థులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ఎలాంటి లోపాలకు తావు లేకుండా హాస్టళ్లను నిర్వహించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గజ్జలమ్మ అమ్మవారికి మొదటి జీతంతో బంగారు మొక్కు సమర్పణ



కుంటాల, జూలై 30(జనం సాక్షి):కుంటాల మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ గజ్జలమ్మ అమ్మవారి ఆలయంలో మండలంలోని ఓల గ్రామానికి చెందిన శ్రీమతి రాసురి నిరంజన శ్రీనివాస్ దంపతుల కుమార్తె కుమారి అంకిత ఇటీవల సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగం సాధించారు. తాను సాధించిన ఈ విజయానికి అమ్మవారి కృపే కారణమని భావించిన ఆమె, తన మొదటి నెల జీతాన్ని అమ్మవారి సేవకే అంకితం చేయాలని ఇందులో భాగంగా గురువారం ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించి, 30,164 విలువ గల బంగారాన్ని అమ్మవారికి మొక్కుబడిగా భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కుమారి అంకిత వారి కుటుంబ సభ్యులకు గజ్జలమ్మ అమ్మవారి దివ్య కరుణాకటాక్షాలు, ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగేష్, కమిటీ ప్రతినిధులు సోమ రాములు, మేసినేని వెంకటరావు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి భోగ గోవర్ధన్ మరియు భక్తులు పాల్గొన్నారు.